PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 50 | విజయవాడ, శనివారం 20 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 20 September 2025 | Rs



చరిత్ర సృష్టించిన అంతిమ్

- ప్రపంచ రెజ్లింగ్ పోటీల్లో రెండోసారి కాంస్య పతకం

8

'ఉల్లి'కి హెక్టారుకు రూ.50 వేలు


- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించాలని సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన శుక్రవారం పాత్రికేయులతో మాట్లాడారు. సిఎం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రభుత్వంపై సుమారు రూ.100 కోట్లు అదనపు భారం పడుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో కర్నూలులో 45,278 ఎకరాల్లో ఉల్లి పంటను సాగుచేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో 24,218 మంది రైతులు లబ్ధిపొందనున్నట్లు మంత్రి వెల్లడించారు. పంటకు ధర పలికినప్పుడే ఉల్లిని విక్రయించాలని రైతులకు సూచించారు. మార్కెట్‌లో సరైన ధరలు లభించే వరకూ రైతులు సహనంతో ఉండాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో 2020లో క్వింటాకు రూ.770 మద్దతు ధర ప్రకటించి ఏ ఒక్కరి దగ్గరా కొనుగోలు చేయలేదన్నారు.

రాజ్యాంగ పీఠిక చదవండి!

- ప్రభుత్వం సెక్యులర్‌గా వ్యవహరిస్తుందన్న సుప్రీం ధర్మాసనం



న్యూఢిల్లీ : జాతీయ ఐక్యతకు ప్రధానమైన ఆదర్శాలుగా లౌకికవాదం, ఆలోచనల్లో, విశ్వాసాల్లో స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం మన రాజ్యాంగం పీఠికలో పొందుపరచబడిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని సుప్రీం కోర్టు పిటిషనర్‌కు సూచించింది. చాముండేశ్వరి ఆలయంలో చారిత్రక మైసూరు దసరా ఉత్సవాల ప్రారంభోత్సవానికి బుకర్ ప్రైజ్ విజేత, ముస్లిం అయిన ప్రముఖ రచయిత్రి బాను ముష్తాక్ ఆహ్వానించడంపై అభ్యంతరం తెలియజేస్తూ బెంగళూరుకు చెందిన హెచ్‌ఎస్ గౌరవ్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆయన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ తోసిపుచ్చింది. భారత రాజ్యాంగం పీఠికను చదివారా? లేదా? ముందు వెళ్లి చదవిరండి! అని పిటిషనర్‌కు మొట్టికాయలు వేసింది. అసలు రాజ్యాంగ పీఠిక అంటే ఏమిటో తెలుసా? అని జస్టిస్ నాథ్ పిటిషనర్‌ను నిలదీశారు. దసరా ఉత్సవాలను బాను ముష్తాక్‌తో ప్రారంభించాలనుకోవడం ప్రభుత్వం తీసుకున్న కేవలం రాజకీయపరమైన చర్య అని పిటిషనర్ తరపు న్యాయవాది పిబి సురేష్ వాదించారు. హిందూయేతర వ్యక్తిని హిందూ మతపరమైన కార్యక్రమాల్లో ఎలా భాగం చేస్తారని ఆయన విస్మయం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని 25వ అధికరణ (మతస్వేచ్ఛ) కింద ముఖ్యమైన మత ఆచారాల్లో భాగంగా హిందువే పూజ చేయాలని పిటిషనర్ వాదించారు. కర్ణాటక హైకోర్టు కూడా ఈ కేసును సెప్టెంబరు 15న కొట్టివేసింది. బాను ముష్తాక్ ముస్లిం కమ్యూనిటీకి చెందినవారని, ఆమెను హిందూయేతర వ్యక్తిగా చూడకపోవడం తప్పని పిటిషన్ వాదించింది. అందువల్ల ఆమె హిందూ దేవత ముందు పూజలుచేయరాదని, అది హిందూ మత ఆచారాలకు, పద్ధతులకు వ్యతిరేకమని స్పష్టం చేసింది. ఈ దశలో జస్టిస్ నాథ్ జోక్యం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని కర్ణాటక ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం సెక్యులర్‌గా వ్యవహరిస్తుందని, దానికంటూ ఒక మతం వుండదని 1994లో అయోధ్య చట్టం చెల్లుబాటుపై ఇస్మాయిల్ ఫరూకి కేసులో తీర్పు సందర్భంగా రాజ్యాంగ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. 'ఇది ప్రభుత్వ కార్యక్రమం. ప్రైవేటు కార్యక్రమం కాదు. ఎ, బి లేదా సి మతాలంటూ ప్రభుత్వం తేడాలను గుర్తించదు' అని జస్టిస్ నాథ్ నొక్కి చెప్పారు. బాను ముష్తాక్‌ను పూజలో భాగం కానివ్వబోమని ప్రభుత్వం హామీ ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలంటూ పిటిషనర్ కోరారు. ఆ డిమాండ్‌ను కూడా కోర్టు తోసిపుచ్చింది. కర్ణాటక ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న కపిల్ సిబాల్ కోర్టు నిర్ణయాన్ని అభినందించారు. పిటిషన్‌ను తోసిపుచ్చుతూ కోర్టు ఇచ్చిన కారణాలను ప్రశంసించారు. లౌకికవాదం అనేది భారత రాజ్యాంగంలోని మౌలిక అంశమని గత తీర్పుల సందర్భంగా స్పష్టం చేసిన అంశాన్ని సుప్రీం కోర్టు మరోసారి గుర్తు చేసింది.

అనుసంధానంతో లబ్ధి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అసెంబ్లీలో సాగునీటి రంగంపై చర్చలో సిఎం

ప్రాధాన్యతా క్రమంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నదుల అనుసంధానం, సమర్థ నీటి నిర్వహణతోనే భవిష్యత్ తరాలకు, రాష్ట్రానికి లబ్ధి కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్రంలో నీటివనరుల సమర్థ నిర్వహణ అనే అంశంపై జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని, నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని అన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో 1.06 కోట్ల ఎకరాలకు నీరిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదిన్నరకాలంలో రూ.12 వేల కోట్లు పెట్టుబడి పెట్టామని తెలిపారు. భూగర్భజలాలు ప్రస్తుతం 697 టిఎంసిలు ఉన్నాయని, వాటిని ఇంకా పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 8.34 మీటర్ల ఎత్తులో నీరుందని పేర్కొన్నారు. నీటిని సమర్థవంతంగా వినియోగించుకుని ఎపిని కరువు రహిత రాష్ట్రంగా తయారు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని వివరించారు. ప్రాధాన్యత క్రమంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులను పూర్తిచేస్తామన్నారు. 200 టిఎంసిలను గోదావరి నుండి బనకచర్లకు తీసుకెళితే ఆ ప్రాంతం సశ్యశ్యామలం అవుతుందని అన్నారు. బెదిరించినందువల్ల ప్రాజెక్టులు ఆగవని, ఎవరూ భయపడేది లేదని అన్నారు. పిపిపి పద్ధతంటే ప్రైవేటీకరణ కాదని, నేషనల్ హైవేలు కూడా పిపిపిలో ఉంటాయని, అవి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లలేదని అందరూ గుర్తించాలని సిఎం తెలిపారు.

పోలవరాన్ని నాశనం చేశారు

గత పాలకులు పట్టిసీమ వద్దన్నారని, అయినా తాము పట్టుబట్టి రూ.1400 కోట్లు వెచ్చించి పూర్తి చేశామని చెప్పారు. నీటిని కృష్ణానదికి మళ్లించడం ద్వారా దానికి 40 రెట్లు ఆదాయం వచ్చిందన్నారు. గతంలో రూ.400 కోట్లతో పోలవరం డయాఫ్రం వాల్ నిర్మిస్తే వైసిపి ప్రభుత్వ చర్యల వల్ల దెబ్బతిందని, ఇప్పుడు రూ.960 కోట్లు వెచ్చించి నిర్మించాల్సి వస్తుందని అన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులను రూ.960 కోట్లతో చేపడుతున్నామని, ఉత్తరాంధ్రకు నీళ్లిస్తామని చెప్పారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని చెప్పారు.

హంద్రీ నీవాతో రాయలసీమ అభివృద్ధి

హంద్రీ నీవా కాలువ ద్వారా రాయలసీమ ప్రాంతాన్ని పూర్తిగా సశ్యశ్యామలం చేస్తామని అన్నారు. వంద రోజుల్లో రూ.3,800 కోట్లు మంజూరు చేసి 3,850 క్యూసెక్కుల నీటిని హంద్రీనీవా ద్వారా పారిస్తునట్లు తెలిపారు. హంద్రీ నీవాపై ఇప్పటి వరకూ రూ.13 వేల కోట్లు ఖర్చు పెట్టామన్నారు.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు ప్రాధాన్యత

ఉత్తరాంధ్రలో రూ.185 కోట్లు ఖర్చు చేస్తే వంశధార ఫేజ్-2 పనులు పూర్తవుతాయని, తోటపల్లి, తారకరామతీర్థసాగర్, మహేంద్రతనయ, హీరమండలం, వంశధార, నాగావళి, మద్దువలస, నాగావళి,చంపావతి, జంఘావతి, గండిగెడ్డ, ప్రాజెక్టుల పూర్తికి రూ.2097 కోట్లు వ్యయం అవుతుందని వివరించారు. కొత్త ఆయకట్టుకు 1.25 లక్షల ఎకరాలకు నీరివ్వవచ్చనిచెప్పారు. అలాగే రెండు లక్షల ఎకరాలు స్థిరీకరణ జరుగుతుందని పేర్కొన్నారు.

ఎత్తిపోతలను దెబ్బతీశారు

వైసిపి ప్రభుత్వ హయాంలో 613 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పాడు చేశారని తెలిపారు. 6.5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే పరిస్థితి ఉన్నా ఇవ్వలేదని చెప్పారు. ఎత్తిపోతల పథకాల కింద 8.30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. రూ.725 కోట్లు ఖర్చు చేసి ఈ ఏడాదిలోనే వాటి ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు. తుంగభద్ర గేట్లు దెబ్బతిన్నాయని, పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. శ్రీశైలం డ్యామ్‌లో స్పిల్‌వే రక్షణ కోసం రూ.204 కోట్లు దవళేశ్వరం బ్యారేజీ కోసం రూ.150 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. గుండ్లకమ్మ గేట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

రూ.25 కోట్ల జరిమానా కట్టాం

చిత్తూరు జిల్లాలో త్రీబ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మిస్తామంటూ గత ప్రభుత్వం రూ.2,144 కోట్లు అంచనాతో పనులు చేపట్టారని, ఎన్‌జిటి రూ.25 కోట్లు జరిమానా వేసిందని, వాటిని కూటమి ప్రభుత్వం కట్టిందని తెలిపారు. తొలుత నీటి వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టుల వివరాలు వెల్లడించారు. ఈ అంశంపై సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కొండ్రము మురళీ, వేమిరెడ్డి ప్రశాంతి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, జి.వి.ఆంజనేయులు తదితరులు మాట్లాడారు. ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పనుల్లో రూ.407 కోట్లు బకాయి ఉందని, ఇప్పటి వరకూ విడుదల చేయలేదని తెలిపారు. రూ.50 కోట్లు విడుదల చేస్తే చెరువులు నింపొచ్చని, మంత్రిని కలిసినా చేస్తామంటున్నారు తప్ప చేయడం లేదని పేర్కొన్నారు. అనంతరం అన్ని పనులూ ప్రాధాన్యతా క్రమంలో చేపడతామని మంత్రి రామానాయుడు వివరించారు.

ఇక 13 గంటల పని విధానం

- రాత్రి షిఫ్టుల్లో మహిళలు
- బిల్లుల ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పని గంటల విధానంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. అమల్లో ఉన్న ఎనిమిది గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచారు. రాత్రి షిఫ్టుల్లో మహిళలతోనూ పని చేయించుకునేందుకు వీలుగా చట్టంలో సవరణలు చేశారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మొత్తం నాలుగు బిల్లులను ఆమోదించారు. ఫ్యాక్టరీల చట్టం 1948ను రాష్ట్రానికి వర్తించేలా సవరణలు చేసే బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. చట్టంలోని 54వ సెక్షన్లో కార్మికుడు పది గంటలకు మించి పనిచేయరాదని పేర్కొంటునే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ అనుమతితో 13 గంటల వరకూ పనిచేయించుకునేందుకు అనుమతి ఇచ్చారు. మధ్యలో ఆరు గంటలకు ఒకసారి అరగంట విశ్రాంతి ఇవ్వాలని పేర్కొన్నారు. ఒక వారంలో మొత్తం 60 గంటలకు మించి పనిచేయించరాదన్నారు.

సెక్షన్ 65లోని సబ్‌సెక్షన్లు 2, 3లో సాధారణ పని ఒత్తిడిని అధిగమించేందుకు అవసరమైతే పని గంటలు పెంచుకోవచ్చని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు ముందు రాత్రి 7 గంటల తరువాత ఫ్యాక్టరీల్లో పనిచేసే మహిళా కార్మికుల సమ్మతితో పనిచేయించుకోవచ్చని సెక్షన్ 66లోని సబ్‌సెక్షన్ 1(బి)లో మార్పులు చేశారు. రాత్రి విధుల్లో ఉండే మహిళలకు రవాణా సదుపాయం కల్పించాలని, వారికి అవసరమైన అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.



లిక్కర్‌స్కామ్ కేసులో సిట్ జోరు

- 'వైఎస్ అనిల్' లక్ష్యంగా సోదాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం కుంభకోణం కేసులో తాజాగా రంగంలోకి దిగిన ఇడి దర్యాప్తు కొనసాగుతుండగా, మరోవైపు సిట్ జోరు పెంచింది. మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి సమీప బంధువుగా ప్రచారంలో ఉన్న వైఎస్ అనిల్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని సిట్ అధికారులు పెద్ద ఎత్తున దాడులకు దిగారు. ఆయనకు సంబంధించిన ఇళ్లు, కంపెనీలు, ఇతర ఆస్తులపై చెన్నై, హైదరాబాద్‌లలో శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు దాడులు జరిగాయి. హైదరాబాద్‌లో ఎనిమిది కంపెనీలు, చెన్నై మైలాపూర్‌లోని నాలుగు, టీనగర్, పెరుంగుడి, అరక్కుకొట్టైలోని మూడు కంపెనీల్లో ఇడి అధికారులు తనిఖీలు చేశారు. చెన్నై అళ్వార్‌పేట, ఇజాంబాకంలోని నివాసాల్లో కూడా తనిఖీలు జరిగినట్లు తెలిసింది. సిల్‌హ ఇన్‌ఫ్రా, ఖనా ఎగ్జిమ్, సొలోహ్ ఇండస్ట్రీస్, ఇండోరాక్స్, వర్క్స్ ఈజీ స్పేస్ తదితర సంస్థల్లో ఈ దాడులు జరిగినట్లు సమాచారం. అయితే, ఈ దాడుల్లో ఏం స్వాధీనం చేసుకున్నారన్న విషయాన్ని సిట్ అధికారులు ప్రకటించలేదు. వైసిపి హయాంలో అనిల్‌రెడ్డి అనేక లావాదేవీలలో జోక్యం చేసుకున్నారంటూ ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు గురువారం రోజు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తంజావూరు, సూరత్, రాయ్‌పూర్, ఢిల్లీతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సోదాలు చేసి పలు కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. తాము 20 ప్రాంతాల్లో దాడులు చేసినట్లు ఇడి అధికారులు ప్రకటించారు. దీంతో ఇడి దాడులు మరింత ముమ్మరమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మిథున్‌రెడ్డిని విచారించిన సిట్

మద్యం కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వైసిపి ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని శుక్రవారం సిట్ అధికారులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రశ్నించారు. అనంతరం వైద్యపరీక్షల నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు. మిథున్‌రెడ్డి విచారణ శనివారం కూడా జరగనుంది.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై

స్తంభించిన మండలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశంతో శుక్రవారం నాడు శాసనమండలి స్తంభించింది. ఉదయం మండలి సమావేశం ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు ఈ అంశంపై చర్చించాలని పట్టుబట్టారు. దీంతో పలుసార్లు వాయిదా పడింది. ప్రారంభమైన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదురుకావడంతో ఛైర్మన్ కె మోషేనురాజు సోమవారానికి వాయిదా వేశారు. వైసిపి సభ్యులు మెడికల్ కళాశాలల పిపిపికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. వైసిపికి వ్యతిరేకంగా అధికారపక్ష సభ్యులు సైతం ప్లకార్డుల ప్రదర్శనకు దిగారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు పోటాపోటీ నినాదాలతో మండలి మారుమ్రోగింది. సమావేశం ప్రారంభం కాగానే 'ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ-పిపిపి విధానం' గురించి చర్చించాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, సిపాయి సుబ్రహ్మణ్యం, కుంభా రవిబాబు వాయిదా తీర్మానాన్ని అందచేశారు. దీనిని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించిన ఛైర్మన్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. దీంతో ఈ అంశంపై చర్చ జరపాలని ఎమ్మెల్సీలు పట్టుబడుతూ వారి స్థానాల నుంచి వెల్‌లోకి వచ్చి 'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సిగ్గు సిగ్గు' అంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకొని ఛైర్మన్ కుర్చీ వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. ఈ సమయంలో ఛైర్మన్ సభను వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైన తరువాత కూడా వైసిపి సభ్యులు వారి ఆందోళనలు కొనసాగించారు. ఈ సమయంలో ఛైర్మన్ ప్రశ్నోత్తరాలు కొనసాగించారు. ఈ సందర్భంగా టిడిపి సభ్యులు భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వైసిపి సభ్యులు సభను సజావుగా సాగనివ్వడం లేదని, తమకు మంత్రులు చెప్పే సమాధానం వినపడటం లేదని చెప్పడంతో మరోసారి సభను ఛైర్మన్ వాయిదా వేసి బిఎసి సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రారంభమైన తరువాత కూడా సభలో ఆందోళన కొనసాగింది. వైసిపి సభ్యులు ఛైర్మన్ పోడియం వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలోనే మిగతా 7లో

పోటాపోటీగా ప్లకార్డుల ప్రదర్శన, నినాదాల జోరు



పోడియం వద్ద పోటాపోటీగా ఆందోళన చేస్తున్న వైసిపి, టిడిపి కూటమి సభ్యులు



చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన ఎమ్మెల్సీలు

టిడిపిలోకి ముగ్గురు ఎమ్మెల్సీలు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపికి చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు బి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్ శుక్రవారం సాయంత్రం సిఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి టిడిపి కండువా కప్పి చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. తాము వైసిపికి, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశామన్నారు.

మండలిలో తమ రాజీనామాలను ఛైర్మన్ ఆమోదించడం లేదన్నారు. రాజీనామాల ఆమోదం కోసం ఆరు నెలలుగా వేచి చూశామన్నారు. రాజీనామా ఆమోదిస్తారన్న నమ్మకం లేదన్నారు. మండలి ఛైర్మన్ వెనుక వైసిపి పెద్దలు కొంతమంది తమ రాజీనామాలను ఆమోదించకుండా అడ్డుకుంటున్నారని మర్రి రాజశేఖర్ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు సునీల్, విజయశ్రీ, పులివర్తి నాని, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్, రామ్‌గోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, బిటి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ, ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ సుజయకృష్ణ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి దసరా సెలవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పాఠశాలలకు ఈ నెల 22 నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటన ద్వారా శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలని టిడిపి ఎమ్మెల్సీలు తన దృష్టికి తీసుకొచ్చారని, వారి కోరిక మేరకు విద్యాశాఖ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. అక్టోబరు 2వ తేదీ వరకూ దసరా సెలవులు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 24 నుంచి అక్టోబరు 2 వరకు పాఠశాల విద్యాశాఖ దసరా సెలవులను ప్రకటించింది. అయితే మహాలయ అమావాస్య నుంచి దశమి వరకు సెలవులిచ్చే ఆనవాయితీ ఉందని పలు ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నెల 22 నుంచి మహాలయ అమావాస్య మొదలవుతున్నందున అప్పటి నుంచే సెలవులివ్వాలని కోరాయి. దీంతో, ఈ నెల 22 నుంచీ అక్టోబర్ 2 వరకూ సెలవులు ప్రకటించినట్లు మంత్రి లోకేష్ పేర్కొన్నారు.



మాకవరపాలెంలో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీ ఎదుట మాట్లాడుతున్న శ్రీనివాసరావు, లోకనాథం తదితరులు

పిపిపి విధానాన్ని విరమించుకోండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- మాకవరపాలెంలో వైద్య కళాశాల నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి - కోటవురట్ల, నక్కపల్లి (అనకాపల్లి)

మెడికల్ కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో నిర్మించాలని తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వమే కళాశాలల నిర్మాణం చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను ప్రైవేటుకు ధారాదత్తం చేయడం తగదన్నారు. మాకవరపాలెంలో నిర్మించతలపెట్టిన మెడికల్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దాదాపు మూడు స్లాబుల వరకు పూర్తయిన భవనాలను అర్ధాంతరంగా నిలిపివేసి, నిర్మాణ సామగ్రిని తరలించడం తగదన్నారు. కరోనా విపత్తు సమయంలో ప్రభుత్వ ఆస్పత్రులు ఎంత గొప్పగా సేవలందించాయో గుర్తుచేశారు. విశాఖలో అదానికి కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టెలికం, ఎయిర్‌లైన్స్ వంటి సంస్థలను ప్రైవేటుకు అప్పగించగా పూర్తి నష్టాల్లో ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రైవేటుకు వైద్య కళాశాలలను అప్పగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మెడికల్ కళాశాల పూర్తయితే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు సమీప ప్రాంతాలలో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకులు త్రిమూర్తులు రెడ్డి, అడిగర్ల రాజు, చిరంజీవి, ఎల్.గౌరి, కెవి.సూర్యప్రభ, ప్రసన్న పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేక పోరాటానికి మద్దతు

నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్క్‌ను రద్దు చేసే వరకు పోరాడాలని ఆందోళనకారులకు వి.శ్రీనివాసరావు కోరారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు కొనసాగిస్తున్న రిలే దీక్షలకు శుక్రవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు తమ సమస్యలను విన్నవించారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు రాష్ట్రంలో ప్రజలు ఎక్కడా అంగీకరించలేదని, అటువంటిది ఇక్కడ ఎలా ఏర్పాటు చేస్తారని వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఇప్పటికే హెటిరో కాలుష్యం కారణంగా ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

కేంద్రానికి కొమ్ముకాస్తూ..

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడతారా?

- కూటమి గెలిచాక ఉక్కు ఉద్యమానికి వెన్నుపోటు : వి. శ్రీనివాసరావు

2

మిష్బా కుటుంబానికి సిఎం సాయం

- ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లాలో 2022లో మిష్బా ఆత్మహత్యకు వైసిపి నేతలే కారణమని మదనపల్లి ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. నాటి వైసిపి ప్రభుత్వం మిష్బా ఆత్మహత్యపై కనీసం కేసు కూడా నమోదు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఆ కుటుంబానికి సత్వర న్యాయం చేసిందన్నారు. గత ప్రభుత్వ పరిపాలనలో మంచి చదువు చదవటం కూడా నేరమైందని, ముస్లిం మైనార్టీ విద్యార్థిని మిష్బా 8, 9, 10 తరగతుల్లో ఫస్ట్ ర్యాంక్ విద్యార్థి అని చెప్పారు. తాను చదువుతున్న స్కూల్‌లో ఫస్ట్ రాకూడదని వైసిపి కుట్ర పన్ని అవమానపరచటం, వేధింపులకు పాల్పడటంతో, తట్టుకోలేక మిష్బా 2022లో ఆత్మహత్య చేసుకుందన్నారు. గత ప్రభుత్వంలో సదరు నిందితులపై కనీసం కేసు కూడా నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ విషయంపై సిఎం చంద్రబాబు స్పందించారని తెలిపారు. మిష్బా తల్లిదండ్రులను తాను సిఎం వద్దకు తీసుకెళ్తే వారికి సిఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.5 లక్షలు సాయం చేశారన్నారు. పుంగనూరులో ఇంటి స్థలం కేటాయించి ఆర్థికంగా ఆదుకున్నారని వివరించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

- ఫ్లెక్సీల స్థానంలో బయోడీగ్రేడబుల్ ఫ్లెక్సీలు
- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, అందుకోసం శాసనసభ్యులు, అధికారులతోపాటు ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉందని, కానీ ఆచరణలో క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదన్నారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యంపై గుంటూరు ఎమ్మెల్యే గళ్లా మాధవి అడిగిన ప్రశ్నకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సమాధానమిస్తూ.. ఒకసారి వాడే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ వంటి అన్ని శాఖలతోపాటు కలెక్టర్లను ఆదేశించినట్లు ఆయన సభకు తెలిపారు. ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలను అరికట్టేందుకు, తనిఖీలు నిర్వహించడానికి జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. బయో డిగ్రేడబుల్ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించడం కోసం ఎపిపిసిబి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా (ఎఎఫ్ఆర్) ఉపయోగించేందుకు 8 సిమెంట్ కో-ప్రాసెసింగ్ ప్లాంట్లకు 46 ప్లాస్టిక్ వ్యర్థ రీ సైక్లర్‌లకు అనుమతినిచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ ఎకానమీ (సిఇ) కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతాల వారీ సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు పవన్‌కల్యాణ్ తెలిపారు. పిసిబిలో సరిపడినంతమంది ఉద్యోగులు లేరన్నారు. రాంకీ సంస్థకు నోటీసులిచ్చి చర్యలు తీసుకున్నామన్నారు. పారిశ్రామికవేత్తలను భయపెట్టడం తమ ప్రభుత్వ అభిమతం కాదని, వారిని కూర్చోబెట్టి సమస్యను చెప్పి పరిష్కరిస్తామని తెలిపారు.



కేరళ తరహాలో బాటిల్‌కు రూ.10 వెనక్కి ఇచ్చే ఆలోచన
డిప్యూటీ స్పీకరు రఘురామ



కేరళలో బాటిల్ కొనుగోలు చేస్తే రూ.10 అదనంగా తీసుకుంటారని, తిరిగి గాజు గ్లాసు వారికి వెనక్కి ఇవ్వగానే అదనంగా తీసుకున్న రూ.10లను తిరిగిచ్చే పద్ధతి ఉందని, మన రాష్ట్రంలో కూడా అటువంటి పద్ధతి ప్రవేశపెడితే ఎలా ఉంటుందనే ఆలోచన చేయాలని డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణమరాజు ప్రభుత్వానికి సూచించారు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉన్నట్లా.. లేనట్లా?
బోండా ఉమామహేశ్వరరావు



పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విజయవాడలో ఉన్నట్లా? లేనట్లా? అనేది అర్థం కాని పరిస్థితి నెలకొందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు శాసనసభలో ప్రశ్నించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయానికి వెళితే ఏది అడిగినా డిప్యూటీ సిఎం ఆఫీస్ నుంచి ఫోన్ చేయించండని అంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్యరామిరెడ్డికి చెందిన రాంకీ పరిశ్రమ నుంచి వ్యర్థాలను సముద్రంలోకి వదులుతుంటే పిసిబి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బోండా ఉమా ప్రశ్నించారు. పిసిబిలో మెంబర్ సెక్రటరీ, టాస్క్‌ఫోర్స్ సరిగ్గా పనిచేయడం లేదన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

- మరణించిన ఉపాధ్యాయ కుటుంబాలను ఆదుకోవాలి
- మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సర్వీస్‌లో మృతిచెందిన ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి శాసనమండలిలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల కారుణ్య నియామకాలపై మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశాన్ని ఆయన లేవనెత్తారు. 2013లో 3552 మెమో తీసుకొచ్చి స్థానిక సంస్థల ఉపాధ్యాయులకు స్థానిక సంస్థల్లోనే నియామకాలు చేపట్టాలని, ప్రభుత్వంలో ఇవ్వకూడదని నిబంధన తీసుకొచ్చారని తెలిపారు. స్థానిక సంస్థల్లో ఉపాధ్యాయులు ఎక్కువగా మరణిస్తున్నారని, కానీ అక్కడ ఖాళీలు ఉండటం లేదన్నారు. కరోనా సమయంలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు మరణించారని చెప్పారు. 3552 మెమోను సవరించి ఖాళీ ఉన్నచోట కారుణ్య నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మోడల్ పాఠశాలల్లో కూడా 17 మంది ఉపాధ్యాయులు మరణించారని, అక్కడ ఖాళీలు మాత్రం లేవని చెప్పారు. ఐదేళ్లలో సుమారు 980 మంది ఉపాధ్యాయులు మరణించారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మెమోను సవరించి ఖాళీలున్న చోట నియామకాలు చేపట్టి వారిని ఆదుకోవాలని కోరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. కారుణ్య నియామకాల కల్పనకు మొత్తం 3,441 దరఖాస్తులు వచ్చాయని, వీరిలో 2,569 మందిని నియమించామని, ఇంకా 852 మందికి నియామకాలు ఇవ్వాలని తెలిపారు. కరోనాతో మరణించిన వారికి గ్రామ, వార్డు సచివాలయాల్లో నియామకాలు చేపట్టాలని 2023లో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందని, ప్రస్తుతం ఈ అంశం కోర్టులో ఉందన్నారు. ఈ నియామకాలపై ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని చెప్పారు.

పిఆర్‌సి, ఆర్థిక బకాయిలు చెల్లించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్‌సి, ఆర్థిక బకాయిలు చెల్లించాలని గోపిమూర్తి కోరారు. ఈ మేరకు మండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. 11వ పిఆర్‌సి 2023 జూన్ 30వ తేదీతో పూర్తయ్యిందని, 2023 జులై ఒకటి నుంచి 12వ పిఆర్‌సి అమలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికీ రెండేళ్ల కాలం వృథా అయ్యిందని చెప్పారు. వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్ డిఎలు విడుదల చేయాలని కోరారు. 11వ పిఆర్‌సి, డిఎ, సరెండర్ లీవులు, పెన్షనర్ బెనిఫిట్స్ బకాయిలు చెల్లించాలని కోరారు.

డిజిటల్ కార్పొరేషన్ నిధుల మళ్లింపుపై చర్యలు ఎందుకు తీసుకోరు?

- ప్రభుత్వాన్ని నిలదీసిన అధికార పక్ష సభ్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిజిటల్ కార్పొరేషన్ నిధులు యాత్ర-2 సినిమా కోసం దారి మళ్లించినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాథమిక నివేదికిచ్చినా బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమిటని టిడిపి సీనియర్ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కూన రవికుమార్, శ్రావణ్‌కుమార్ ప్రశ్నించారు. శాసనసభ రెండోరోజు శుక్రవారం ప్రశ్నోత్తరాల్లో భాగంగా రాష్ట్రంలో డిజిటల్ కార్పొరేషన్ నిధుల మళ్లింపు అంశంపై సభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2019-24 మధ్య యాత్ర-2 సినిమా కోసం డిజిటల్ కార్పొరేషన్ ద్వారా రూ.2 కోట్లు మళ్లించారని, ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిధులు దారి మళ్లించారన్నారు. ఈ ఏడాది జనవరి 21న అవకతవకలు జరిగినట్లు ఇడి ప్రాథమిక నివేదిక ఇచ్చినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. డిజిటల్ కార్పొరేషన్‌లో అవసరమైన విద్యార్హత లేని వారికి ఉద్యోగాలిచ్చారని, ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకున్నారా? ఇప్పటి వరకు వారి నుంచి ఎంత రికవరీ చేశారు? జిఎస్‌టి చెల్లింపు చేయకపోయినా ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు? అని ప్రశ్నించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా డిపార్టుమెంటల్ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి పార్థసారధి మాట్లాడుతూ.. డిజిటల్ కార్పొరేషన్‌లో అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ నివేదిక ఇచ్చిన మాట నిజమేనని, పూర్తి విచారణకు సిఐడికి ఇచ్చామని, నివేదిక రాగానే చర్యలు ప్రారంభమవుతాయన్నారు. అవసరమైన విద్యార్హతలు లేని 60 మందికి ఉద్యోగాలిచ్చినట్లు, మరో 19 మంది సాక్షి ఉద్యోగులు, ఐప్యాక్, ఐడ్రీమ్‌లలో పనిచేసే వారిని రిక్రూట్ చేసినట్లు నివేదికలో పొందుపరిచారని పార్థసారధి సభకు తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో కొబ్బరి ప్రాసెసింగ్ యూనిట్ గురించి శాసనసభ్యుడు దేవీ వరప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానమిస్తూ.. ఎంఎస్ఇ-సిడిపి పథకం కింద రాజోలు నియోజకవర్గం పెదపట్నం లంకలో రూ.9.96 కోట్ల వ్యయంతో రెండెకరాల్లో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక పార్కులు గురించి కొణతాల రామకృష్ణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి అడిగిన ప్రశ్నకు మంత్రి టిజి భరత్ సమాధానమిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎపిఐఐసి 1.45 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 596 పారిశ్రామిక ఆస్తులను అభివృద్ధి చేసేందుకు కేటాయించినట్లు తెలిపారు.

జరిమానాలతో అనుమతులు

- అక్రమ కట్టడాలపై మంత్రివర్గ నిర్ణయం
- 13 బిల్లులకు ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలకు జరిమానాలతో అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎప్పటినుంచో దీనిపై చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రుల నుంచి వచ్చిన సూచనలకు అనుగుణంగా తాజా భేటీలో నిర్ణయం తీసుకున్నారు. అగస్టు 31 నాటికి గుర్తించిన అక్రమ కట్టడాలకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. అన్ని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు (ఉడాలు), రాజధాని అభివృద్ధి ప్రాంతంలో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. అయితే రాజధానిని మాత్రం ఇందులో మినహాయింపు నిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు 1955 మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, 1965 ఎపి మున్సిపాల్టీల చట్టం, 2014 ఎపిమిసిఆర్‌డిఎ చట్టం, 2016 ఎపి మెట్రోపాలిటిన్ రీజియన్-అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ చట్టాలను సవరించాలని నిర్ణయించారు. రాజధాని ప్రాంతంలో భారీ ప్రాజెక్టులను అమలు చేసేందుకు స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటుచేయాలని కూడా మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. . దీనివల్ల ప్రాజెక్టుల ఏర్పాటు వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. అలాగే ఓటర్ల జాబితాపైనా సమావేశంలో చర్చించారు. దీనికోసం ప్రత్యేకంగా మూడు తేదీలను ఖరారు చేయాలని నిర్ణయించారు. రాజధాని ప్రాంతంలోనే గతంలో 343 ఎకరాలకు ఇచ్చిన భూసకేరణ నోటిఫికేషన్‌ను కూడా ఉపసంహరించుకుంటున్నట్లు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. అలాగే లిఫ్ట్ పాలసీలో భాగంగా చిన్న సంస్థలకు భూములు ఇవ్వాలన్న ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపారు. పంచాయితీరాజ్ పరిధిలోని కొన్ని భూములను వ్యవసాయం నుంచి వ్యవసాయేతర భూములుగా మార్పు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. జిఎస్‌టి - 2005 బిల్లుకు చేసిన సవరణలకు కూడా ఆమోదం తెలిపారు.

13 బిల్లులకు ఆమోదం

మంత్రివర్గ సమావేశంలో మొత్తం 13 బిల్లులకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నాలా చట్టం రద్దు, ఎపి ఆక్వాకల్చర్ అభివృద్ధి సంస్థ చట్ట సవరణ, ఎపి విశ్వవిద్యాలయాల చట్ట సవరణ, అంతర్జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ఏర్పాటు తదితరాలు వీటిలో ఉన్నాయి.

మీరు చెప్పింది నిజమైతే..

- సిఎం ప్రసంగంపై డిప్యూటీ స్పీకర్ వ్యంగ్యం
- టిడిపి సభ్యుల అభ్యంతరం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'మీరు చెప్పింది నిజమైతే... మీరే అపర భగీరథుడు...' అంటూ సిఎం చంద్రబాబుపై డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణరాజు వ్యంగ్య వ్యాఖ్యానం చేశారు. సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో 'అదే.. అదే నిజమవుతుందనే అంటున్నా' అంటూ సమర్థించుకున్నారు. రెండోరోజు శుక్రవారం నాడు అసెంబ్లీలో జలవనరుల సమర్థ నిర్వహణపై లఘు చర్చ జరిగింది. దీనిపై మంత్రులు, సభ్యులు మాట్లాడిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చలో మాట్లాడారు. సుదీర్ఘ వివరణ అనంతరం ఆయన అందరికీ నమస్కరించి కూర్చున్నారు. ఆ సమయంలో సభాధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకరు కె రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ.. 'మీరు చెప్పిన విజన్ నిజమైతే అపర భగీరథుడుగా చరిత్రలో నిలిచిపోతారు' అని వ్యాఖ్యానించారు. దీంతో టిడిపి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిజమైతే కాదు.. నిజమవుతుంది అంటూ కేకలు వేశారు. దీన్ని సమర్థించుకునే సమయంలో డిప్యూటీ స్పీకరు.. నిజమైన వెంటనే అన్నాను అంటూ సమర్థించుకున్నారు. నిజమవుతుందనీ, అదే అన్నానంటూ సభను సోమవారానికి వాయిదా వేశారు. క్వశ్చన్ అవర్లోనూ మంత్రులు సమాధానం ఇచ్చిన తరువాత సభ్యులు అనుబంధ ప్రశ్న అడిగితే మంత్రులు సమాధానం ఇవ్వబోతుండగా మరలా చెప్పాల్సిన అవసరం లేదంటూ మంత్రులనూ నియంత్రించారు. దీంతో డిప్యూటీ స్పీకరు తీరుపై టిడిపి పక్ష సభ్యులు ఒకింత అసహనానికి గురయ్యారు. చివర్లో సిఎం ప్రసంగంపైనా వ్యంగ్య వ్యాఖ్యానం చేయడంతో సభ్యుల్లో తీవ్ర చర్చ జరిగింది.

కండక్టర్ కుసుమ కుమారిని విధుల్లోకి తీసుకోవాలి

- ఆర్‌టిసి ఎమ్‌డికి ఎస్‌డబ్ల్యుఎఫ్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన కండక్టర్ కుసుమకుమారిని తక్షణమే సాధారణ విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తమ విధులకు సంబంధించి పనిలో ఎదుర్కొంటున్న వీడియోను షేర్ చేశారనే కారణంగా ఆమెను సోమవారం నుంచి లైన్ డ్యూటీల నుంచి తొలగించారని పేర్కొన్నారు. విచారణ జరిగినప్పటికీ ఆమెకు ఎటువంటి విధులు కేటాయించలేదని, ఇది సంస్థ ఉన్నత ప్రమాణాలకు విరుద్ధమన్నారు. ఉద్యోగులు తమ సమస్యలను సోషల్ మీడియాలో పంచుకోవడాన్ని నిషేధించే ఎటువంటి సర్క్యులర్ లేదా నియమం ఆర్‌టిసి ప్రధాన కార్యాలయం నుంచి రాలేదనే విషయాన్ని ఈ ఎస్‌డబ్ల్యుఎఫ్ నేతలు గుర్తు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-19 ప్రకారం పౌరులు, ఉద్యోగులకు వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ ఉందని, డిపో మేనేజరు చర్యలు కార్మిక వ్యతిరేకమైనవిగా తాము భావిస్తున్నామన్నారు.

కేంద్రానికి కొమ్ముకాస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడతారా?

- కూటమి గెలిచాక ఉక్కు ఉద్యమానికి వెన్నుపోటు : వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపి, సొంత గనులను కేంద్రం నుంచి సాధిస్తాం. కూటమికి ఓట్లు వేయండి' అంటూ ఎన్నికల ముందు చెప్పి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో పాల్గొన్న టిడిపి, జనసేనలు గెలిచాక ఉక్కు ఉద్యమానికి వెన్నుపోటు పొడిచాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విశాఖలోని జగదాంబ దరి పార్టీ కార్యాలయంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక కార్మిక ఆందోళనలను అణచివేస్తూ, కూర్మన్నపాలెం వద్ద నాలుగున్నరేళ్లుగా నడుస్తున్న ఉక్కు ఉద్యమ దీక్షా శిబిరాన్ని తొలగించిందన్నారు. ఇనుప కంచెలు పెట్టి ధర్నాలకు వీల్లేదని చెప్పి కార్మికుల నోళ్లు మూయించే ప్రయత్నం చేసిందన్నారు. కార్మికులపైనా, పోరాడే నాయకులపైనా విశాఖ ఎంపి శ్రీభరత్, గాజువాక టిడిపి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, చేసిన తప్పులను కార్మికుల మీద రుద్దేసి నైతికంగా కార్మికోద్యమాన్ని దెబ్బతీస్తూ ప్రైవేటీకరణ కుట్రలు సాగిస్తే సహించబోమని హెచ్చరించారు. రూ.11,400 కోట్లు ప్యాకేజీలో రా మెటీరియల్‌కి ఎంత ? జీతాలకు ఎంత ? ఉత్పత్తికి ఎంత ? అయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.400 కోట్ల మేర జీతాల బకాయిలు ఉన్నాయి.. వాటిని ఇచ్చారా ? అని ప్రశ్నించారు. అర్థాకలితో బాధపడుతూ ఉత్పత్తిలో భాగస్వాములవుతున్న కార్మికులను అభినందించాల్సిందిపోయి ఆరోపణలు చేస్తే టిడిపిని ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు క్షమించరని హెచ్చరించారు.

మిట్టల్ ఉద్యోగులా ? లేక ఏజెంట్లా ?

ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్‌కు గనుల కోసం ఎంపిలతో కలిసి స్థానిక ఎంపి శ్రీభరత్ ఊడిగం చేయడం తగదన్నారు. మీరు ఏమైనా మిట్టల్ ఉద్యోగులా ? ఏజెంట్లా ? అని ప్రశ్నించారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలు, కార్మికుల తరుపున ఎందుకు మాట్లాడటం లేదంటూ రాష్ట్ర ఎంపిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కులో కార్మికుల సంఖ్య పెరిగిపో యిందని ఐదు వేల మందికిపైగా కాంట్రాక్టు కార్మికులను తొలగించేసి, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసు కోవడం సరైంది కాదన్నారు. ఉక్కు నిర్వాసితులకు ఇప్పటికీ ఉద్యోగాలు కల్పించలేదన్నారు. ఉక్కులోని విభాగాలను ముక్కలుగా చేసి అమ్మేసేందుకు కుట్రలు జరుగుతున్నా యన్నారు. కూటమి ప్రభుత్వం లూలూ, అదానీ, ఉర్సా, సత్వా వంటి కార్పొరేట్ కంపెనీలకు వందల ఎకరాల భూములను చౌకగా విశాఖలో కట్టబెడుతోందని, ఒక్క సంస్థ కూడా కార్యకలాపాలు ప్రారంభించలేదని, ఇంతవరకూ రాష్ట్రంలో ఎన్ని సంస్థలకు ప్రభుత్వం ఎన్ని ఎకరాలిచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆపరేషన్ కగార్ పేర మావోయిస్టులపై దమనకాండ సరికాదు

రాష్ట్రంలో, ఇరుగు పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టులపై జరుగుతున్న దమనకాండ, ఎన్‌కౌంటర్లను తీవ్రంగా ఖండిస్తున్నామని విఎస్ఆర్ అన్నారు. 'పోరాట విరమణ చేస్తున్నాం, సాయుధ పోరాటాన్ని వదులుతున్నాం, ఆయుధాలను విసర్జిస్తాం' అని ఓపెన్‌గా ప్రకటించాక కూడా వచ్చేమార్చిలోగా మావోయిస్టులను అంతం చేస్తామని అమిత్‌షా బహిరంగంగా ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. చర్చలకు మావోయిస్టులు ముందుకొచ్చినా ప్రభుత్వం సిద్ధపడలేదన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం అనే ఒక అధికార ప్రైవేట్ సైన్యం, ఒక రాజ్యాంగేతర శక్తిపై అప్పట్లో తీర్పునిచ్చిన, ఇటీవల ఉపరాష్ట్రపతిగా ఇటీవల పోటీచేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్ షా దాడి చేయడం హేయమన్నారు. మావోయిస్టులను అణచివేయడానికి ఒక అవుట్‌సోర్సింగ్ ప్రైవేట్ సైన్యానికి ప్రభుత్వం మద్దతివ్వడం వల్ల ప్రజలు, గిరిజనుల ప్రయోజనాలు ప్రమాదంలో పడవా ? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు.

పంచాయతీల్లో పట్టణస్థాయి సౌకర్యాలు

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీల్లో పట్టణ స్థాయి సౌకర్యాల కల్పన లక్ష్యంగా సమూల మార్పులకు శ్రీకారం చుట్టాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సాధారణ పరిపాలనా, ఆర్థిక, న్యాయశాఖల ఉన్నతాధికారులతో పంచాయతీలకు పునర్ వ్యవస్థీకరణ, నూతన సంస్కరణలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పంచాయతీల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆర్థిక వెసులుబాటు, లోపభూయిష్ట పరిపాలనా వ్యవస్థ పంచాయతీలకు అవరోధాలుగా మారాయని పేర్కొన్నారు. 48 ఏళ్ల కిందట రూపొందించిన సిబ్బంది నమూనానే ఇప్పటికీ పంచాయతీల్లో అమలులో ఉందన్నారు. గ్రేడ్ల నిర్ణయానికి ఆదాయమే ప్రాతిపదిక కాదని, జనాభా, మండల కేంద్రం, గిరిజన, గిరిజనేతర ప్రాంతాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని 4 గ్రేడ్లుగా విభజించబోతున్నట్లు చెప్పారు. ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి స్థాయి నుంచి సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. సమీక్షా సమావేశంలో జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్, పిఆర్అండ్ఆర్‌డి ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి, ఒఎస్‌డి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోండా వ్యాఖ్యల వెనుక కారణమేంటి?
క్రెబ్స్ బయోకెమికల్స్ ఫైల్‌పై నివేదిక కోరిన పవన్‌కల్యాణ్

శాసన సభలో ప్లాస్టిక్ కాలుష్యంపై జరిగిన చర్చలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు.. పిసిబి ఛైర్మన్ కృష్ణయ్యపై చేసిన వ్యాఖ్యలు బెదిరింపు ధోరణిలో ఉన్నాయని, వ్యక్తిగత ఉద్దేశాలతో ఒకరిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడారని అనిపిస్తోందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే ఆ విధంగా ఎందుకు వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని కృష్ణయ్యను పవన్‌కల్యాణ్ అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో పిసిబి ఛైర్మన్, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో క్రెబ్స్ బయో కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ గురించి ఆయన ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పిసిబి విచారణ చేపట్టి చర్యలు చేపట్టడం తదనంతర పరిణామాలను కృష్ణయ్య వివరించారు. ఇందుకు సంబంధించిన అంశాలతో సమగ్ర నివేదిక రూపంలో ఇవ్వాలని, ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తానని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

ఉద్రిక్తతల నడుమ 'చలో మెడికల్ కాలేజీ'

- పోలీసుల అడ్డగింతలు - అరెస్టులు
- పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలు : రజిని

ప్రజాశక్తి - యంత్రాంగం



ఆదోనిలో రహదారిపై నిరసన తెలుపుతున్న మాజీ ఎంపి రేణుక, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, నాయకులు

వైసిపి నాయకులు చేపట్టిన 'చలో మెడికల్ కాలేజీ' పర్యటనలు ఉద్రికత్తతలకు దారి తీశాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన వైసిపి అభిమానులు, ప్రజలను నిలువరించేందుకు ప్రభుత్వం పోలీసు బలగాలను ప్రయోగించింది. కాలేజీ వద్దకు వెళ్తున్న నాయకులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేపట్టారు. పలువురు తాజా,మాజీ ఎమ్మెల్యేలు, నాయకులను హౌస్ అరెస్టు చేశారు. మెడికల్ కాలేజీలు పూర్తి కాలేదని టిడిపి కూటమి నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు తిప్పికొట్టేందుకు ఆయా మెడికల్ కాలేజీల వద్దకు వెళ్లి పలువురు ఫొటోలు దిగారు. పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసే కుట్రలు పన్నుతున్నారని మాజీ మంత్రి విడుదల రజిని విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మాజీ ఎంపి మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను వారి ఇళ్ల వద్దే పోలీసులు అడ్డుకున్నారు.

దీంతో పోలీసులు, వైసిపి నాయకుల మధ్య తోపులాటలు చోటు చేసుకున్నాయి. పోలీసుల తీరును నిరసిస్తూ వైసిపి నాయకులు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పోలీసులు భారీ స్థాయిలో మోహరించారు. విజయవాడ వైపు నుంచి వస్తున్న దేవినేని అవినాష్ తదితరులను పోలీసులు మూడు స్తంభాల సెంటర్ వద్ద అడ్డుకున్నారు. వైసిపి కార్యకర్తలు పోలీసులను దాటుకొని మెడికల్ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. నంద్యాల మెడికల్ కళాశాల వద్దకు వస్తున్న వైసిపి యువనేత బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి అడ్డుకుని నందికొట్కూరులో ఆయనను హౌస్ అరెస్టు చేశారు. మెడికల్ కళాశాలకు చేరిన వైసిపి అధికార ప్రతినిధి అమృతరాజు, జిల్లా కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి మరికొందరిని అరెస్టు చేసి నంద్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కర్నూలు జిల్లా ఆదోనిలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనం వద్ద కర్నూలు మాజీ ఎంపి బుట్టారేణుక, ఆదోని, పత్తికొండ మాజీ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ, కడప, ప్రకాశంలో నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గృహ నిర్బంధం చేశారు. అల్లూరి జిల్లా పాడేరులో ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిన ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని అరకు ఎంపి తనూజరాణి, మాజీ ఎంపి మాధవి అన్నారు. ఏలూరులో మెడికల్ కాలేజీకి వెళ్తున్న వైసిపి నేతలను టిడిపి నాయకులు, కార్యకర్తలు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల నేతలను పోలీసులు సముదాయించి వెనక్కి పంపించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

- ముఖ్యమంత్రికి ప్రజారోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య కళాశాలల ప్రవేటీకరణకు జారీ చేసిన పిపిపి నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రానికి మంజూరైన 10 వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ నిధులతో నిర్మించి, నిర్వహించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు శుక్రవారం లేఖ రాశారు. జిఓ 107, 108లను రద్దు చేయాలని, ఆరోగ్యశ్రీలో బీమా విధానాన్ని విడనాడాలని లేఖలో కోరారు. లాభాపేక్షను నిరోధించడానికి ప్రైవేటు ఆస్పత్రులను నియంత్రించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఉచిత మందులు, సేవలను పెంచాలని కోరారు. ప్రజారోగ్యానికి బడ్జెట్ కేటాయింపులను జిడిపిలో ప్రస్తుతం ఉన్న 1.24 శాతం నుంచి 6 శాతానికి పెంచాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనకు, సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య హక్కు చట్టాన్ని రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ బాధ్యతలను స్పష్టంగా నిర్వహించాలన్నారు. ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్యను ప్రభావితం చేసే ఏ విధమైన మార్పులనైనా చేపట్టే ముందు పౌర సమాజం, నిపుణులు, భాగస్వాములతో సంప్రదింపులు జరపాలన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు ప్రధానంగా నిధుల సమస్యను ప్రభుత్వం ప్రస్తావిస్తుందని, ఇది సరికాదన్నారు. ప్రతి వైద్య కళాశాలకు రూ.500 కోట్లు అవసరం ఉండగా, ఈ నిధుల్లో 80 శాతం వరకూ కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని, మిగిలిన 20 శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉందన్నారు. ఈ నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి లేక నాబార్డు వంటి సంస్థల నుంచి రుణం పొందేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. పిపిపి అంటే స్వల్ప మార్పులతో ఉండే ప్రైవేటీకరణేనని చెప్పారు. ప్రైవేటు సంస్థలు లాభం కోసం మాత్రమే పని చేస్తాయని, మానవత, సేవా దృక్పథం తక్కువ అని అన్నారు. ఇప్పటికే ఉన్న ప్రైవేటు వైద్య కళాశాలల్లో సీటు రూ.కోటికిపైగా చేరుకుందన్నారు. దీంతో సంపన్నులకు మాత్రమే వైద్య విద్య అందుబాటులో ఉంటుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, మహిళలు, వికలాంగులకు, ఆర్థికంగా బలహీన వర్గాలకు రిజర్వేషన్ల అమలుకు ఇబ్బంది నెలకొంటుందన్నారు. వైద్య సేవల్లో ఇప్పటికే తీవ్రమైన కొరతతో సతమతమవుతున్న రాష్ట్రానికి వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చర్య అసమానతలను మరింత పెంచుతుందని పేర్కొన్నారు. మరోవైపు దేశంలో 40కి పైగా ప్రైవేటు వైద్య కళాశాలల్లో భారీ అక్రమాలు జరిగాయని సిబిఐ జరిపిన దర్యాప్తులో వెల్లడైందన్నారు. గత ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానం కోసం తీసుకొచ్చిన 107, 108 జిఓలను టిడిపి, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని, అధికారంలోకి వస్తే వీటిని రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విషయాన్ని ఈ లేఖలో ప్రస్తావించారు.

గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు

- అసెంబ్లీలో బిల్లు ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వాహనాలపై గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గిస్తూ బిల్లును అసెంబ్లీలో శుక్రవారం ఆమోదించారు. 7 నుంచి 12 సంవత్సరాల మధ్య ఉన్న వాహనాలకు ఇప్పటి వరకూ రూ.15 వేలు ఉండగా, దాన్ని రూ.1500 తగ్గించారు. 12 సంవత్సరాల కంటే ఎక్కువగా ఉంటే రూ.3000 మాత్రమే చెల్లించేలా బిల్లును ఆమోదించారు. ఈ బిల్లును మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ ప్రవేశపెట్టారు.

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ వయసు సడలింపు

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌ను ఇప్పటి వరకూ 60 ఏళ్ల వయసులోపు ఉండేవారినే నియమించాలనే నిబంధనలను సడలించారు. వయసు పరిమితిని రద్దు చేశారు. ఈ మేరకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రవేశపెట్టిన బిల్లును సభ ఆమోదించింది.

అసెంబ్లీకి రావడానికి ఆంక్షలా? : సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా వైసిపి ఎమ్మెల్యేలతో మాజీ సిఎం వైఎస్ జగన్ ఇంట్లోనే శాసనసభను పెట్టుకుంటున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జగన్ మాదిరిగా అసెంబ్లీకి రావడానికి ఆంక్షలు పెట్టే ప్రజా ప్రతినిధి ఎవ్వరూ ఇంత వరకు లేరని తెలిపారు. మొత్తం సభ్యుల్లో 10 శాతం సీట్లు కూడా రాని వారికి ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తామని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతిపక్ష హోదా ఇస్తే తరువాత సిఎం హోదా కూడా అడుగుతారని వ్యంగ్యంగా అన్నారు. స్పీకరుతో మాట్లాడి తగిన సమయం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. 1994లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 సీట్లకు గానూ 26 సీట్లు అంటే 10 శాతం కంటే తక్కువ వచ్చినా పి జనార్ధన్‌రెడ్డి హుందాగా అసెంబ్లీకి వచ్చారని గుర్తు చేశారు.



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు



అరకులోయ తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన వేలాది మంది గిరిజనులు

'హైడ్రో'తో మా గ్రామాలు జలసమాధి

- ప్రాజెక్టు రద్దు చేయాలని ఆదివాసీల ర్యాలీ
- అరకులోయ తహశీల్దార్ కార్యాలయం ముట్టడి
- రద్దు చేస్తూ అసెంబ్లీలో ప్రకటించాలని డిమాండ్

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి జిల్లా)


గిరిజనుల జీవితాలను జల సమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులపై అల్లూరి జిల్లా ఆదివాసీలు భగ్గుమంటున్నారు. హైడ్రో ప్రాజెక్టులకు అనుమతులిస్తూ జారీ చేసిన జిఒ నంబర్ 51ను తక్షణం రద్దు చేయాలంటూ అరకులోయ మండల కేంద్రంలో శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి పెద్దపెట్టున ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రాజెక్టు ఏర్పాటుతో తమ గ్రామాలు మునిగిపోతాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు ఐదు వేల మందికిపైగా ఆదివాసీలు తమ పిల్లాపాపలతో తరలి రావడంతో అరకులోయ జనసంద్రంగా మారింది. ఆదివాసీలను ఉద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రాజెక్టులతో 250 గ్రాములు మునిగిపోతాయని, 50 వేల మంది గిరిజనులు జలసమాధి అవుతారని తెలిపారు. ఆరు మండలాల గిరిజనుల బతుకులు చిన్నాభిన్నమవుతాయని అన్నారు. ఈ దుర్మార్గమైన చర్యకు ప్రభుత్వం పూనుకోవడం అన్యాయమన్నారు.

టిఎసిలో చర్చించకుండా, పీసా కమిటీ, గ్రామసభ తీర్మానం లేకుండా, 1/70 చట్టానికి విరుద్ధంగా నవయుగ, అదాని కంపెనీలకు ఆదివాసీ ప్రాంతాలను కట్టబెట్టడం దారుణమన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో గ్రామాల్లోకి అధికారులు ఎవరైనా వస్తే తరిమికొట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, నాయకులు వి.ఉమామహేశ్వరరావు, రామారావు, బుజ్జిబాబు, దశరథ్, చిన్నబాబు, రామన్న, రమేష్ పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

తెలకపల్లి రవికి జాషువా కవితా పురస్కారం

- 27న గుంటూరులో ప్రదానం

ప్రజాశక్తి - గుంటూరు



తెలకపల్లి రవి

గుర్రం జాషువా కవితా పురస్కారానికి ప్రముఖ పాత్రికేయులు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి ఎంపిక అయ్యారు. ఈ నెల 27న గుంటూరులో జరిగే జాషువా 130వ జయంతి సందర్భంగా ఆయనకు ఈ పురస్కారం అందజేయనున్నట్లు జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు శుక్రవారం గుంటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తెలుగు ప్రజలకు తెలకపల్లి రవి సుపరిచితులు. ప్రజాశక్తి దినపత్రిక, ప్రచురణాలయం సంపాదకులుగా పనిచేశారు. సాహిత్య విమర్శకులుగా, నవల, కథ, గేయ రచయితగానే కాకుండా కవితా రచన కూడా చేశారు. సాహిత్య మాసపత్రిక సాహిత్య ప్రస్థానం సంపాదకులుగా దీర్ఘకాలం పనిచేశారు. ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా వందలాది యువకవుల కోసం జనకవనం, సాహిత్య శాలలు నిర్వహించారు. సంకలనాలు, అనువాదాలతో సహా దాదాపు 80 రచనలు ముద్రితమయ్యాయి. ప్రగతిశీల తాత్వికతకు నిబద్ధుడై, ప్రజల కేంద్రంగా రచనలు చేసే రవికి 2025 గుర్రం జాషువా సాహితీ పురస్కారాన్ని అందజేయడం సముచితంగా భావిస్తున్నామని పాశం రామారావు తెలిపారు. సమావేశంలో విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ బాధ్యులు ఎన్.భావనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ జాతీయ పోటీలకు విజయనగరం క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఈనెల 23 నుంచి 25 వరకు గుంటూరులో జరగనున్న 36వ జాతీయ సౌత్ జోన్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు విజయనగరం జిల్లా నుండి ఎనిమిది మంది అథ్లెట్లు ఎంపికయ్యారు. పి.వసంత (100, 200 మీటర్ల పరుగు), ఎం.దివ్య (వంద మీటర్ల పరుగు), పి.నీలిమ (లాంగ్ జంప్), ఎ.ఆదిలక్ష్మి (షాట్ పుట్), టి.పాల్ కుమార్ (ట్రిపుల్ జంప్), ఎం.హరీష్ (5వేల మీటర్ల పరుగు), బి.హరీష్ (వాకింగ్), బి.సాయి (పదివేల మీటర్ల రన్), ఎంపికయ్యారు. క్రీడాకారులకు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

ఢిల్లీకి మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత శుక్రవారం ఢిల్లీ పయనమయ్యారు. న్యూఢిల్లీలోని ఓక్ హాలులో శనివారం జరిగే స్కోచ్ అవార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరై బిసి సంక్షేమశాఖ పొందిన స్కోచ్ అవార్డును ఆమె అందుకోనున్నారు. మెగా డిఎస్‌సి, సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందజేసినందుకు ఆ శాఖకు స్కోచ్ అవార్డును ప్రకటించిన విషయం తెలిసిందే.

ఉల్లి రైతుకు గిట్టుబాటు ధర ఏది?

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. అసెంబ్లీలో ప్రభుత్వానికి బాకా కొట్టుకోకుండా ఉల్లి రైతుల సమస్యలపై చర్చించాలని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ.1,200 ధర కల్పిస్తామన్న ప్రభుత్వం.. అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూలు మార్కెట్‌లో దళారుల మాయాజాలాన్ని అడ్డుకోవాలని కోరారు. బెనిఫిట్ షోలకు టిక్కెట్ల ధరల పెంపుపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించే విషయంలో లేదన్నారు. ఉల్లి రైతులను నిండా ముంచేశారన్నారు. మార్క్‌ఫెడ్ ఎంత ఉల్లిని కొందనే వివరాలు వెల్లడించాలన్నారు. కిలో 50 పైసలకు అమ్ముకోలేక రైతులు మార్కెట్‌లోనే వదిలేస్తున్నారని చెప్పారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం

బంగారు గొలుసుల దొంగతనం, నకిలీ నోట్ల తయారీ చేసే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 35 లక్షల విలువజేసే 304 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.35,500 నగదు, నకిలీ 500 రూపాయల నోట్లు, ప్రింటర్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కాన్ఫెరెన్స్ హాల్లో ఎస్‌పి పి జగదీష్ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. అనంతపురం జిల్లా కంబదూరు మండల కేంద్రానికి చెందిన ఎం జశ్వంత్, భోగం రాజు ఇద్దరూ స్నేహితులు. క్రికెట్ బెట్టింగ్, పేకాట తదితర వ్యసనాలకు అలవాటు పడ్డారు. డబ్బు కోసం దొంగలుగా మారారు. దీంతోపాటు నకిలీ దొంగనోట్ల చలామణికి పన్నాగం పన్నారు. వారిపై నిఘా ఉంచిన అనంతపురం సిసిఎస్, పుట్లూరు పోలీసులు పక్కా సమాచారంతో శుక్రవారం ఇద్దరిని పుట్లూరు మండలం శెనగల గూడూరు గ్రామ సమీపంలో అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

- తిరుపతిలో ఇ-సేవ ఉద్యోగుల అభ్యర్థన దీక్ష

ప్రజాశక్తి- తిరుపతి టౌన్



దీక్షల్లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి

ఇ-సేవలో తొలగించిన 607 మంది ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తిరుపతి కొర్లగుంట సమీపంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద అభ్యర్థన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో తిరుపతి, చిత్తూరు,కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఇ-సేవ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ... ఇ-సేవ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని, అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటామని, ఉద్యోగులకు భద్రత కల్పిస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా వారి గురించి పట్టించుకోలేదన్నారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిఐటియు ప్రత్యక్ష మద్దతును తెలియజేస్తుందని ప్రకటించారు. ఎపి ఇ-సేవ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ...ప్రభుత్వ పథకాలు నడపడానికి, ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు వసూలు చేయించడంలోనూ కీలకపాత్ర వహిస్తున్నామని, ఒక రకంగా ప్రభుత్వ నిర్వహణలో తమ పాత్ర కీలకంగా ఉందని అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, తొలగించిన 607 మంది ఉద్యోగులకు తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రవి కిరణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శ్రీనివాస్, భువనేశ్వరి (నెల్లూరు) రాష్ట్ర సహాయ కార్యదర్శి, సునీల (నెల్లూరు) రాష్ట్ర కార్యదర్శి, రామకృష్ణ (తిరుపతి) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రమేష్ (కడప) రాష్ట్ర సహాయ కార్యదర్శి, శ్రీధర్ (కర్నూలు) రాష్ట్ర కమిటీ సభ్యులు, రాధాకృష్ణ, హరిప్రసాద్ (గుంటూరు), లోకేష్, శ్రీనివాస్ (అనంతపురం) పాల్గొన్నారు.

సంస్కరణల పేరుతో విద్యారంగం నిర్వీర్యం

అప్పుల కోసం ప్రయివేటుపరం : ఎమ్మెల్సీ గోపిమూర్తి
యుటిఎఫ్ రణభేరి జాతాకు పలు సంఘాల మద్దతు

ప్రజాశక్తి - యంత్రాంగం

సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులు విమర్శించారు. ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందంతో విద్యారంగం నాశనమైందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ చేపట్టిన రణభేరి జాతాలు శుక్రవారం కడప, నంద్యాల, గుంటూరు, ఏలూరు, విశాఖ, ఒంగోలులో కొనసాగాయి. ఆయా చోట్ల జాతాకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. మోటార్ సైకిళ్ల ర్యాలీలు చేపట్టారు. ఈనెల 25న గుంటూరులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు.



గుంటూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కడప జిల్లా బద్వేల్‌లో జాతాకు యుటిఎఫ్ నాయకులతో పాటు డివైఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా తదితర ప్రజాసంఘాల నాయకులు స్వాగతం పలికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ...ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి మాట్లాడుతూ... అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లోగా ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలన్నింటినీ చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం రూ.7500 కోట్ల బకాయిలను మాత్రమే చెల్లించిందని, మరో రూ.30 వేల కోట్ల చెల్లింపులపై స్పష్టమైన వైఖరి లేదన్నారు. నంద్యాలలో జరిగిన బహిరంగ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మిరాజా, జయ చంద్రారెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యారంగ సంస్కరణలు అమలు చేస్తూ ప్రపంచ బ్యాంకు నుంచి రూ.1860 కోట్ల అప్పు తెసుకుందని, ఈ అప్పు ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరచడమే ప్రధాన లక్ష్యంగా ఉందని విమర్శించారు.

గుంటూరులో జాతాను మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. తొలుత ఉపాధ్యాయ ఉద్యమ నేత చెన్నుపాటి లక్ష్మయ్య విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నుండి మినహాయించాలని, పిఆర్‌సి కమిటీ చైర్మన్‌ను నియమించాలని, పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలని కెఎస్ లక్ష్మణరావు, ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏలూరులో నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ... అప్పుల కోసం విద్యారంగాన్ని ప్రయివేటుపరం చేసేందుకు పాలకులు వ్యూహాలు రచిస్తున్నారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ అడుగుజాడల్లోనే పాలన సాగిస్తోందని విమర్శించారు.

విశాఖలో ఆనందపురం, చంద్రంపాలెం, గోపాలపట్నం, ఎన్ఎడి జంక్షన్ మీదుగా సాగుతూ గాజువాకకు చేరుకుంది. ఆయాచోట్ల పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు, ఉద్యోగులు స్వాగతం పలికారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో సంఘం రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్ మాట్లాడారు. ప్రకాశం జిల్లా మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి పూల సుబ్బయ్య కాలనీ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

అమెరికాకు తగ్గిన భారత పర్యాటకులు

- ఆగస్టులో 15 శాతం ప్రభావం
- టారిఫ్ ఆందోళనలు
- రూపాయి భారం ఎఫెక్ట్

న్యూఢిల్లీ : అమెరికాకు వెళ్లే భారత పర్యాటకుల్లో భారీ తగ్గుదల చోటు చేసుకుంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న టారిఫ్ ఆందోళనకు తోడు అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు పర్యాటకులపై ప్రభావం చూపాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ అమాంతం పడిపోవడం అమెరికా పర్యాటకాన్ని భారం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో గడిచిన ఆగస్టులో అమెరికాకు భారత పర్యాటకుల సంఖ్య 15 శాతం పడిపోయింది. నేషనల్ ట్రావెల్ అండ్ టూరిజం ఆఫీస్ (ఎన్‌టిటిఒ) రిపోర్ట్ ప్రకారం.. గతేడాది ఇదే నెలతో పోలిస్తే ఆగస్టులో భారతీయ పర్యాటకుల సంఖ్య భారీగా తగ్గింది. ఇది వరుసగా మూడవ నెల క్షీణతను సూచిస్తుందని తెలిపింది. జూన్‌లో 8 శాతం, జులైలో 6 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. అమెరికా, భారతదేశం మధ్య సుంకాలు, రష్యన్ ఆయిల్ కొనుగోళు, భారతదేశం-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ వాదనలపై ఉద్రిక్తతలు పెరగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ క్షీణత వల్ల ఈ వేసవిలో అమెరికన్ వ్యాపారాలకు సుమారు 340 మిలియన్ డాలర్ల పర్యాటక వ్యయ నష్టం జరిగిందని అంచనా. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ 88 కనిష్ట స్థాయికి పడిపోవడం పర్యాటకులపై తీవ్ర భారాన్ని మోపుతోంది. 2024 ఇదే జూన్‌లో 35 శాతం, జులైలో 26 శాతం, ఆగస్టులో 9 శాతం చొప్పున పెరుగుదల చోటు చేసుకుంది. రెండు దేశాల మధ్య వాణిజ్య మరియు దౌత్యపరమైన ఘర్షణలు, ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై భారీగా సుంకాలు విధించడం యుఎస్ పర్యాటకంపై ప్రతికూలదను చూపిందని నిపుణులు భావిస్తున్నారు. 2024లో ప్రతీ భారతీయ సందర్శకుడు సగటున ఒక్క యాత్రకు 5,200 డాలర్లు ఖర్చు చేశారు. ఇది ప్రపంచ సగటు 1,802 డాలర్ల కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. భారత్ నుంచి అంతర్జాతీయ పర్యాటనల్లో కెనడా, మెక్సికో, యునైటెడ్ కింగ్‌డమ్ తర్వాత యుఎస్ నాలుగవ అతిపెద్ద పర్యాటక కేంద్రంగా ఉంది.



జిఎస్‌టి శ్లాబుల తగ్గింపు..

- పెరగనున్న వినియోగం
- పన్ను వసూళ్లకు మద్దతు • క్రిసిల్ రిపోర్ట్

న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబులను తగ్గించడం ప్రభుత్వ ఖజానాపై తక్కువ ప్రభావమే చూపనుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ పేర్కొంది. వినియోగాన్ని పెంచి, పన్ను ఆదాయాన్ని విస్తరించ నుందని పేర్కొంది. జిఎస్‌టి శ్లాబులను 5, 18 శాతాలకు పరిమితం చేస్తూ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కొత్త రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.48,000 నష్టం వాటిల్లనుందని.. అయినా కేంద్రం భరించడానికి సిద్ధంగా ఉందని బిజెపి నేతలు పదేపదే ప్రకటనలు చేస్తోన్న విషయం తెలిసిందే. అయితే నూతన జిఎస్‌టి శ్లాబులతో పెద్ద నష్టమేమీ జరగదని ఇటీవల నిపుణులు, ఏజెన్సీలు పేర్కొనడం విశేషం.

"నూతన రేట్ల వల్ల స్వల్ప కాలంలో రూ.48,000 కోట్ల నష్టం జరగొచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో మొత్తం జిఎస్‌టి వసూళ్లు రూ.10.6 లక్షల కోట్లుగా ఉన్న నేపథ్యంలో ఆదాయ నష్టం పెద్దగా ఉండదు." అని క్రిసిల్ తన రిపోర్ట్‌లో పేర్కొంది. కొత్త శ్లాబులతో అనేక ఉత్పత్తులు, సేవల ధరలు తగ్గే అవకాశం ఉందని.. దీంతో పన్నులు విస్తరించడం ద్వారా మధ్యస్థ కాలంలో రాబడి పెరగనుందని క్రిసిల్ విశ్లేషించింది. జిఎస్‌టి నూతన శ్లాబులకు ముందు ఆదాయంలో 70-75 శాతం అత్యధిక భాగం 18 శాతం శ్లాబు నుంచే వచ్చేదని గుర్తు చేసింది. 12 శాతం శ్లాబులో కేవలం 5-6 శాతం మాత్రమే రాబడి ఉందని పేర్కొంది. 28 శాతం శ్లాబులో 13-15 శాతం పన్ను రాబడులు నమోదయ్యాయి.

గతంలో 12 శాతం పన్ను విధించబడిన వస్తువులపై రేట్లు తగ్గించడం వల్ల పెద్దగా ఆదాయ నష్టం ఉండదని క్రిసిల్ వెల్లడించింది. మొబైల్ టారిఫ్‌ల వంటి అనేక అధిక వృద్ధి కలిగిన సేవల రేట్లలో మార్పులు లేకుండా ఉన్నాయని తెలిపింది.

ఈ-కామర్స్ డెలివరీ వంటి కొత్త వర్గాలను 18 శాతం రేటు పరిధిలోకి తీసుకొచ్చారని తెలిపింది. పెద్ద ఎత్తున వినియోగించే వస్తువులపై ప్రయోజనాలు, ఆదాయాన్ని మరింత పెంచి, డిమాండ్, వసూళ్లను ప్రోత్సహించవచ్చని క్రిసిల్ పేర్కొంది. ఉత్పత్తిదారులు పన్ను మార్పులను వినియోగదారులకు బదిలీ చేయడం అత్యంత కీలకమని తెలిపింది.


గ్రూప్-1పై తీర్పు వాయిదా

- హైకోర్టులో ముగిసిన వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ దాఖలైన పిటిషన్లలో ఇరుపక్షాల వాదనలు శుక్రవారం పూర్తయ్యాయి. తీర్పును తర్వాత వెలువరిస్తామని హైకోర్టు ప్రకటించింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో అర్హుల జాబితాను 2022 మే 26న ఎపిపిఎస్‌సి వెలువరించింది. వీటిని సింగిల్ జడ్జి రద్దు చేస్తూ 2024 మార్చి 13న తీర్పు చెప్పారు. దీనిని కొట్టేయాలంటూ ఎపిపిఎస్‌సి, అర్హత సాధించిన అభ్యర్థులు అప్పీల్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ బి దేవానంద్, జస్టిస్ హరినాథ్‌శర్మతో కూడిన డివిజన్ బెంచ్ విచారణను పూర్తి చేసింది. ఎపిపిఎస్‌సి తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ.. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరిగిందని నిరూపించేందుకు సిసి ఫుటేజీ లేదన్నారు. రెండు చేతిరాతల వ్యవహారాన్ని నిగ్గు తేల్చేందుకు కమిషన్ కమిటీ వేసిందన్నారు. కోర్టు తుది తీర్పుకు లోబడి ఉంటామని ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు రాతపూర్వక హామీపత్రం ఇచ్చారన్నారు. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరిగిందనేందుకు ఆధారాల్లేకుండానే అందరూ చెబుతున్నారని అర్హత పొందిన అభ్యర్థుల తరపున సీనియర్ అడ్వకేట్లు సివి మోహన్‌రెడ్డి, పి శ్రీరఘురామ్, ఒ మనోహర్‌రెడ్డి వాదించారు. అర్హత సాధించని అభ్యర్థుల తరపున సీనియర్ న్యాయవాదులు జంధ్యాల రవిశంకర్, కెఎస్ మూర్తి, న్యాయవాదులు జొన్నలగడ్డ సుధీర్, షేక్ సలీమ్ వాదిస్తూ.. డిజిటల్ మూల్యాంకనంలో ఎంపికైన అభ్యర్థుల్లో 62 శాతం మంది ఆ తర్వాత మాన్యువల్ మూల్యాంకనంలో ఎంపిక కాలేదన్నారు. ఇలాంటి వాళ్లు కీలక పోస్టులకు ఎంపికయ్యారన్నారు. థర్డ్ పార్టీతో మూల్యాంకనం చేయించారన్నారు. హాయ్‌ల్యాండ్‌కు జవాబు పత్రాలు వెళ్లాయన్నారు. తెలుగులో రాసిన వాళ్లకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఫలితాలను వెల్లడిస్తామని నాటి ఎపిపిఎస్‌సి సెక్రటరీ ఆంజనేయులు చెప్పారని గుర్తు చేశారు. తిరిగి పరీక్ష నిర్వహించేలా ఉత్తర్వులివ్వాలని, సిబిఐతో దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. వాదనలు పూర్తికావడంతో తీర్పును తరువాత వెలువరిస్తామని డివిజన్ బెంచ్ ప్రకటించింది.

ఎఎస్‌సిఐ నూతన చైర్మన్‌గా సుధాంషు వాట్స్



న్యూఢిల్లీ : అడ్వర్టైజింగ్ స్టాండర్డ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) నూతన చైర్మన్‌గా పిడిలైట్ ఇండస్ట్రీస్ ఎండి సుధాంషు ఎంపికయ్యారు. ఆ సంస్థ 39వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారతదేశ ప్రకటనల స్వీయ నియంత్రణ సంస్థ ఎఎస్‌సిఐ అక్టోబర్‌లో 40 ఏళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంలో సుధాంషు ఎన్నిక జరగడం విశేషమని ఆ సంస్థ పేర్కొంది. ముల్లెన్‌లోవ్ గ్లోబల్‌కు చెందిన ఎస్ సుబ్రమణ్యేశ్వర్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ట్రెజరర్‌గా పరితోష్ జోషి ఎన్నికయ్యారు.

సంపాదకీయం

సెబీ కుమ్మక్కు!

అదానీ గ్రూపు ఆర్థిక అక్రమాలకు పాల్పడిందని ప్రముఖ షార్ట్ సెల్లింగ్ ఇంటిలిజెన్స్ సంస్థ హిండెన్‌బర్గ్ విడుదల చేసిన నివేదికతో ప్రపంచం యావత్తూ గగ్గోలు పెట్టగా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఆ కీలక ఆరోపణల్ని తోసిపుచ్చడం దారుణం. మన దేశంలోని అతి ముఖ్యమైన రెగ్యులేటరీ సంస్థ సైతం అదానీ తదితర కార్పొరేట్లకు అనుకూలంగా మారిందనడానికిది తాజా తార్కాణం. "అదానీపై హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరూపణ కాలేదు. అదానీ గ్రూప్ కంపెనీలు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదు. ఆ సంస్థపై జరిమానా విధించాల్సిన అవసరం లేదు." అని సెబీ హోల్ టైం మెంబర్ కమలేష్ చంద్ర వర్ష్నేయ్ తన ఆర్డర్‌లో పేర్కొనడం సిగ్గుచేటైన విషయం. దీంతో అదానీ పోర్ట్స్, అదానీ పవర్, గౌతం అదానీ, రాజేష్ అదానీలపై కొనసాగుతున్న దర్యాప్తు కార్యకలాపాలకు సెబీ మంగళం పాడింది. గౌతం అదానీ అవినీతిని కీలక ఆధారాలతో 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. అదానీ గ్రూప్ తన కంపెనీల ఆదాయాన్ని పెంచడానికి, షేర్ల ధరలను కృత్రిమంగా మార్చడానికి విదేశీ బినామీ, షెల్ కంపెనీలను వాడుకుందని.. అదానీ తీవ్ర ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని అప్పట్లో వెల్లడించింది. ఆ దెబ్బతో ఆ సమయంలో స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు కంపెనీల విలువ దాదాపు లక్షల కోట్లు హరించుకుపోయింది. అదానీ ఆర్థిక అక్రమాలను నిశితంగా పరిశీలించామని, సాక్ష్యాలను సంపాదించామని... దాదాపు 100 పేజీల సాక్ష్యాలను రిపోర్ట్‌లో హిండెన్‌బర్గ్ పేర్కొంది. అయినా అవేవీ సెబీ విచారణలో అక్కరకు రాలేదు. లేదా వాటిని చూడ నిరాకరించినట్టుంది. ఏలినవారి మద్దతుగల శత కోటీశ్వరుడు తప్పు చేశారనీ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారనీ సెబీ చెప్పగలదా? ముమ్మాటికీ అలాంటిది అసంభవమని గత పదేళ్ల చరిత్ర చెబుతోంది.

అప్పటి సెబీ చైర్‌పర్సన్ మాధాబి పురీ బుచ్‌కు అదానీ గ్రూపు సంస్థలతో ఉన్న అక్రమ ఆర్థిక సంబంధాన్ని సైతం హిండెన్‌బర్గ్ బయటపెట్టిన విషయం తెలిసిందే. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారం అంటూనే బెర్ముడా, మారిషస్ వంటి అఫ్ షోర్ కంపెనీల్లో, అందునా గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు బుచ్ ఫ్యామిలీ అంగీకరించిన విషయం లోకానికెరుకే! తన భర్త బాల్య స్నేహితుడు నిర్వహిస్తున్న ఫండ్‌లోనూ పెట్టుబడులు పెట్టారని మాధాబి అప్పట్లో ధృవీకరించారు. 'అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడుల తీరును సమీక్షించాల్సిన సెబీ చైర్మన్‌కు వాటిల్లో వ్యక్తిగత పెట్టబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయి. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుంది.' అని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. అదానీ కంపెనీలతో సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధాబి చరిత్ర ఇదే. దేశంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక వ్యవహారాలను నియంత్రించవలసిన సంస్థకు అధినేతలుగా అటువంటి వ్యక్తులను నియమించడంలోనే అసలు తిరకాసు ఉంది.

నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు క్రమంలో దేశంలో కార్పొరేట్లు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకుల మధ్య బలమైన బంధం ఏర్పడింది. ఆ బంధం గత పదకొండేళ్ల నరేంద్ర మోడీ పాలనలో మరింతగా బలపడింది. అందుకే ఈ మూడు తరగతులకు చెందినవారు ఒకరినొకరు సమర్థించుకోవడం రివాజుగా మారింది. తాజా అంశం వాటిలో ఒకటి మాత్రమే! అదానీ సెకీ కుంభకోణం గురించి ఒకసారి గుర్తు తెచ్చుకున్నా ఈ విషయం అర్థం అవుతుంది. అదానీ గ్రూపు కార్పొరేట్లు, సెకీ, రాష్ట్ర విద్యుత్ రంగ ఉన్నతాధికారులు అప్పటి ప్రభుత్వాధినేతతో జరిపిన మంతనాలు, వేల కోట్ల రూపాయలు చేతులు మారడం... ఇవన్నీ ఒక్కసారి సినిమా రీల్ మాదిరి తిరుగుతాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అవినీతిపట్ల ఇప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఏమీ చెయ్యకుండా ఎందుకు మిన్నకుండిపోయారు? రోజూ బద్ధ శత్రువుల్లా వ్యవహరించే వీరిద్దరికీ ఉమ్మడి స్నేహితునిగా ప్రధాని మోడీ తన అనుంగు మిత్రుడైన గౌతం అదానీని కాపాడారని లోకానికి తెలియనిది కాదు. కాబట్టి ప్రజల సొమ్మును, దేశ సంపదను కొల్లగొడుతున్న ఈ అపవిత్ర కూటమి మోసాన్ని జనం అర్థం చేసుకోవాలి. వాటిని ప్రతిఘటిస్తూ ఐక్య ప్రజా ఉద్యమాలు సాగాలి. అప్పుడే ఇటువంటి అక్రమాలకు చెక్ పెట్టగలం.

మహనీయుల మాట



అన్నింటికీ మించిన నేరం
అన్యాయంతోనూ,
అక్రమాలతోనూ
రాజీ పడటమే.
- నేతాజీ
సుభాష్ చంద్రబోస్

వ్యాఖ్య

అమితమైన ఆలస్యం-నిరర్థక వ్యవహారం

రోమ్ నగరం తగలబడి పోతుంటే ఫిడేలు వాయించిన నీరో చక్రవర్తి కథలో వలెనే ప్రధానమంత్రి ఆ రాష్ట్ర పరిస్థితి సాధారణ పరిస్థితి పునరుద్ధరణ కోసం ఎలాంటి సహానుభూతిని గానీ దృఢ సంకల్పాన్ని గానీ ప్రదర్శించలేదు. అందుకనే ఆయన ఆర్భాటంగా జరిపిన పర్యటన పట్ల మణిపూర్ ప్రజలు ఉదాసీనంగా ఆగ్రహంగా వుండిపోయారంటే అర్థం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా వర్షం పడుతుంటే తంటాలు పడి తీసుకొచ్చిన బడిపిల్లలూ కొద్దిమంది జనాలు పలచ పలచగా మాత్రమే పాల్గొన్నారు. ఇంఫాల్‌లోనూ అదే విధంగా చూరచందాపూర్‌లోనూ ప్రజల నుంచి నిరాసక్త స్పందనలో ప్రధాని ఇంత ఆలస్యంగా రావడానికి కారణమేమిటన్న ప్రశ్న ప్రతిబింబించింది. ప్రజలను చంపేస్తుంటే, మహిళలను బలాత్కరిస్తుంటే, కొంపలు తగలబెడుతుంటే ఈయన ఎక్కడకు పోయారు? ఈ హింసరచనను ఆయన ఎందుకు అనుమతించారు?



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

28 మాసాల అసాధారణమైన ఆలస్యం తర్వాత ...ఖచ్చితంగా చెప్పాలంటే 864 రోజులు ఆలస్యం చేశాక ప్రధానమంత్రి మణిపూర్ సందర్శించారు. ఆ రాష్ట్రంలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ నాయకత్వంలో అప్పటి బిజెపి ప్రభుత్వ పాలనలో అక్కడ అంతర్గత జాతి కలహాలతో హింసాకాండ సాగింది. ఇప్పటికైనా ఏదో విధంగా పోగొట్టుకున్న రాజకీయ బలాన్ని మళ్లీ కూడగట్టుకోవాలనే నిస్పృహతోనే ఈ పర్యటన పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రతిష్టాకరంగా విశ్వాసం కోల్పోయింది. ముఖ్యమంత్రిని తొలగించేందుకు మొండిగా నిరాకరించిన తర్వాతనే రాష్ట్రపతి పాలన విధించబడింది. ఈ కాలంలో ఎంతో రక్తపాతం కొనసాగింది. ఈ జాతి విభజన కలహంలో ఇరువైపులా నివాసాలు, మత సంస్థలూ ధ్వంసం చేయబడ్డాయి. 260 మంది చంపివేయబడ్డారు. మహిళలపై అత్యాచారాలు, నగ్నంగా ఊరేగించడాలు జరిగిపోయాయి. 60,000 మంది ఇళ్లు కోల్పోయి దయనీయమైన, అమానవీయ పరిస్థితుల్లో శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవలసి వచ్చింది. అతి సున్నితమైన సరిహద్దు రాష్ట్రంలో మెయితీలు, కుకీల మధ్య సంబంధాలు మళ్లీ చక్కదిద్దలేనంతగా దెబ్బతిని పోయాయి.

రాష్ట్రంలో శాంతిని కాపాడటం చేతగానివారికి పాలించే హక్కే వుండదని గర్జించారు ప్రధాన మంత్రి 2017లో కాంగ్రెస్ పాలిస్తున్న కాలంలో పర్యటించినపుడు. కానీ ఆ తర్వాత బిజెపి అధికారంలోకి వచ్చాక విభజన రాజకీయాల ప్రచారంతో జాతి కలహాగ్ని రగిలినపుడు ఆయన మాటల బూటకత్వమేమిటో తేలిపోయింది. అదొక అంతర్యుద్ధ పరిస్థితిలా చెలరేగింది. ఆ విధంగా రాష్ట్రం తగలబడి పోతున్నా ఆయన మాత్రం స్పందన లేకుండా నిష్క్రియాత్మకంగా వుండిపోయారు.

నిర్లక్ష్యానికి నిరసనే

రోమ్ నగరం తగలబడిపోతుంటే ఫిడేలు వాయించిన నీరో చక్రవర్తి కథలో వలెనే ప్రధానమంత్రి ఆ రాష్ట్ర పరిస్థితి సాధారణ పరిస్థితి పునరుద్ధరణ కోసం ఎలాంటి సహానుభూతిని గానీ దృఢ సంకల్పాన్ని గానీ ప్రదర్శించలేదు. అందుకనే ఆయన ఆర్భాటంగా జరిపిన పర్యటన పట్ల మణిపూర్ ప్రజలు ఉదాసీనంగా ఆగ్రహంగా వుండి పోయారంటే అర్థం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా వర్షం పడుతుంటే తంటాలు పడి తీసుకొచ్చిన బడిపిల్లలూ కొద్దిమంది జనాలు పలచ పలచగా మాత్రమే పాల్గొన్నారు. ఇంఫాల్ లోనూ అదే విధంగా చూరచందాపూర్ లోనూ ప్రజల నుంచి నిరాసక్త స్పందనలో ప్రధాని ఇంత ఆలస్యంగా రావడానికి కారణమేమిటన్న ప్రశ్న ప్రతిబింబించింది. ప్రజలను చంపేస్తుంటే, మహిళలను బలాత్కరిస్తుంటే, కొంపలు తగలబెడుతుంటే ఈయన ఎక్కడకు పోయారు? ఈ హింస రచనను ఆయన ఎందుకు అనుమతించారు?

శాంతిని కాపాడటంలోనూ, నేరస్తులను బోనెక్కించడంలోనూ డబుల్ ఇంజన్ సర్కారు వైఫల్యం నేపథ్యంలోనే ఆయన ఈ పర్యటనకు వచ్చారు. 2023 జూన్‌లో హోంమంత్రి అమిత్ షా పర్యటన సందర్భంగా ఇళు కట్టిస్తామనీ, విద్యా వైద్యం కల్పిస్తామని ఇచ్చిన హామీలు వమ్ము చేయబడ్డాయి. ఆస్పత్రులు అందుబాటులో లేకపోవడంతో దూరం వెళ్లలేక ప్రజలు వైద్యం దొరక్క తిండి కూడా దొరక్క చచ్చిపోతున్నారు. సహాయ శిబిరాల్లోని బాధిత ప్రజానీకం ఆత్మహత్యలు చేసుకుంటున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో నిరాశ్రయులైన వారి సహాయ శిబిరాలను ప్రధాని సందర్శించింది లేదు. అసలైన సమస్యలను ఆయన దాటేశారు. శాంతినీ సాధారణ పరిస్థితినీ పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు ఏమిటో ప్రతిపాదించలేదు. హింసాకాండ బాధితులకు న్యాయం చేయడమనేది సుదూరంలో కనిపించడం లేదు. సాయుధ మూకలపై ఇప్పటికీ ఎలాంటి అదుపూ లేదు. రాష్ట్ర ఆయుధాగారాల నుంచి కొల్లగొట్టిన ఆయుధాలను ఇప్పటికీ తిరిగి స్వాధీనం చేసుకోలేదు. దగ్ధ గృహాలు, సంస్థల పునర్నిర్మాణమేదీ ఇంకా జరిగింది లేదు.

రాజకీయ ప్రయోగశాల

మణిపూర్ సంఘపరివార్ రాజకీయ ప్రయోగశాలగా తయారైంది. బిజెపి ఈశాన్య భారతంలో కాలూనేందుకు జాగా సంపాదించిన కారణంగా అక్కడ ప్రతి రాష్ట్రంలోనూ సంఘపరివార్ విభజన ఎజెండా జొప్పిస్తున్నది. అస్సాం ముఖ్యమంత్రి మైనార్టీలపై విద్వేష విషం చిమ్ముతున్నాడు. ఫలితంగా వారు దాడులనూ గెంటివేతలనూ సర్కారీ అణచివేతను ఎదుర్కొంటున్నారు. అణచివేయబడిన తరగతులు గిరిజనులుగా గుర్తించాలంటూ భారీ ఎత్తున నిరసనలు చేస్తున్నారు. త్రిపురలో కూడా మతపరమైన విభజన తేవడానికీ విద్వేష వ్యాప్తికీ ప్రయత్నాలు నడుస్తున్నాయి.

మిజోరాంలో అటవీ సంరక్షణ చట్టం ఆమోదంతో కేంద్రానికి విపరీతాధికారాలు సంక్రమించాయి. మిజో ప్రజల హక్కులకు ఇదొక ముప్పుగా తయారైంది. అంతర్జాతీయ సరిహద్దుకు వంద కిలోమీటర్ల వరకూ మినహాయింపు నివ్వడం (దేశ భద్రతకూ, జాతీయ భద్రతకు సంబంధించి నడుస్తున్న వ్యూహాత్మక ప్రాజెక్టుల కోసం) ఇందుకు కారణమవుతున్నది. భారత రాజ్యాంగం 371జి అధికరణం, అలాగే గిరిజన స్వయం పాలక మండళ్ల అధికారాలకు రక్షణ కల్పించే 244వ అధికరణాలను ఇది ఉల్లంఘించినట్టు భావిస్తున్నారు. బిజెపి అధికారం కోల్పోయాక చక్మా స్వయం పాలక మండలిలో గవర్నర్ పాలన విధించడం కూడా ఇబ్బందికరంగా మారింది. ఇండియా మయన్మార్ సరిహద్దులో స్వేచ్ఛగా సంచరించే అవకాశాన్ని లేకుండా చేయడం వల్ల సామాజిక, ఆర్థిక సంబంధాలు విచ్ఛిన్నమైనాయి. మిజోరాం, నాగాలాండ్ ప్రజలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ సమస్య ఉద్రిక్తతలకు ఒక కేంద్ర బిందువయ్యే అవకాశం చాలా వుంది.

జరగాల్సిందేమిటి?

నాగా శాంతి ప్రక్రియను క్రమ పద్ధతిలో విచ్ఛిన్నం చేయబడింది. 2015 ఆగస్టు 3న ఒక స్థూలమైన ఒప్పందం రూపురేఖలపై సంతకాలు జరగడం చారిత్రాత్మకమని నరేంద్ర మోడీ కొనియాడారు. అయితే తర్వాత ఆ ఒప్పందం మేరకు మధ్యవర్తిని నియమించడానికి ప్రభుత్వం మొండిగా నిరాకరించడంతో సంప్రదింపులు ప్రతిష్టంభనలో పడి పోయాయి. దీనివల్ల గణనీయమైన ఒత్తిడి, నిస్పృహ ఏర్పడ్డాయి. ఈ ప్రక్రియను గనక వేగవంతం చేయకపోతే ప్రతిఘటనా బృందాలు మళ్లీ ఆయుధాలు చేపట్టే ప్రమాదం తొంగి చూస్తుంది. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు తిరిగి రాక ముందే నాగాలాండ్‌లో హింసాకాండ గనక మళ్లీ ప్రజ్వరిల్లితే ఈ ప్రాంతంలో అసలే అంతంత మాత్రంగా వున్న పరిస్థితులు మరింత దిగజారతాయి.

తక్కిన రాష్ట్రాలలో వలెనే మణిపూర్‌లో కూడా ఖనిజాలు, భూమి, అడవుల వంటి వనరులను కొల్లగొట్టడం యథేచ్ఛగా అనుమతించబడుతోంది. ఆయిల్ పామ్ సాగు పథకం, ఖనిజాల తవ్వకం వంటి పేర్లు మీద వేల ఎకరాలు కార్పొరేట్ల హస్తగతమై పోతున్నాయి.


శాంతి ప్రక్రియ, పునరేకీకరణ, సౌహార్ద్రత, నిస్సైనికీకరణను వేగవంతం చేయవలసిన అవసరముంది. ప్రజల విశ్వాసం పొందడం తప్పనిసరిగా జరగాలి. ఈ సమస్యతో ముడిపడి వున్న వారందరినీ కలుపుకుని వచ్చే ప్రజాస్వామ్య ప్రక్రియ, చర్చలు జరగాలి. దాంతో పాటే సాటి మనుషులపై నేరాలకు పాల్పడే వారి ఆట కట్టించడం జరిగితేనే మణిపూర్ మళ్లీ సాధారణ పరిస్థితులను చేరుకోగలుగుతుంది.

(సెప్టెంబరు17 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

అవీ ఇవీ

క్విడ్ ప్రోకో చాప్టర్ 2

మోడీ, ఆర్.ఎస్.ఎస్ అధినేత మోహన్ భగవత్ క్విడ్ ప్రోకో పొగడ్తల గురించి గతంలో చెప్పుకున్నాం కదా. ఇది దాంట్లో రెండో అధ్యాయం. సెప్టెంబరు 17న ఆయన పుట్టిన రోజున బిజెపి ఆర్గనైజింగ్ కార్యదర్శి (అంటే ఆర్.ఎస్.ఎస్ ప్రతినిధి) బి.ఎల్.సంతోష్ ప్రత్యేకంగా ముందస్తు వ్యాసం రాస్తూ 1970లలో ప్రచారక్‌గా ఆర్.ఎస్.ఎస్ విస్తరణ చేసిందే మోడీ అని కీర్తించారు. ఇక పుట్టిన రోజునైతే పేజీల తరబడి మోడీ మహత్కార్యాలతో బడా పత్రికల్లో ప్రాయోజిత పేజీలే గుప్పించారు. హోంమంత్రి అమిత్ షా కూడా చేయి చేసుకుని ఓ వ్యాసం రాసి తరించారు. శుభాకాంక్షలు చెప్పే భారతీయ నేతలు చాలనట్టు డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేకంగా ఫోన్ చేయడం, దాని కొనసాగింపుగా ఇండియా వాణిజ్య చర్యలపై సానుకూల సంకేతాలు ఇవ్వడం ఒక ప్రహసనంగా జరిగిపోతున్నది. ఈ కథలో కొసమెరుపు ఏమంటే మోడీ జీవితంపై రూపొందించిన చిత్రాన్ని ఎన్నికలు జరిగే బీహార్‌లో నియోజక వర్గాల వారీగా ప్రదర్శిస్తారట. మోడీ గొప్పలు చెప్పుకొని గట్టెక్కాలని సంఘ పరివార్ తంటాలు పడటం ఏ స్థాయికి చేరిందో వేరే చెప్పాలా? కానీ కఠోర పరిస్థితులు కనిపిస్తుంటే ఆ కథనాల కల్పనలు ఎవరు నమ్ముతారు?



లేడీ సూపర్ స్టార్ @ 200 కోట్లు

ఈ రోజుల్లో ఏ భారీ సినిమా విడుదలైనా వంద కోట్లు వసూలు చేస్తుందా లేదా ఆ పైన ఎంత అని లెక్కలు వేస్తుంటారు. 100 కోట్ల సినిమా అనేది ఊతపదంగా మారింది. బాహుబలితో మొదలైన ఈ ధోరణి పాన్ ఇండియా జ్వరంగా మారింది. అవసరాన్ని మించి ఖర్చు పెట్టడం, అందుకోసం కాంబినేషన్లు వర్కవుట్ చేయడం, అవసరాన్ని మించి ప్రమోషన్ ఇవన్నీ ఒక వలయంగా మారాయి. టికెట్ల రేట్ల పెంపు తెచ్చుకోవడం కూడా అందులో భాగమే. అయితే ఇవన్నీ చేసినా చిరంజీవి, మహేష్‌బాబు, ప్రభాస్, పవన్ కల్యాణ్ దాకా బడా హీరోల చిత్రాలే బోల్తా కొట్టడం మామూలై పోయింది. ఈ క్రమంలో ఇటీవల వార్ కూడా బాగా దెబ్బ తింది. మరోవైపున చూస్తే మొదట చిన్ని సినిమాగా పేరొందిన కన్నడ సినమా కూడా కె.జి.ఎఫ్, కాంతార తర్వాత ఈ రేసులో చోటు సంపాదించింది. మోహన్‌లాల్ వంద కోట్ల బొమ్మతో అందరి కన్నా ఆలస్యంగా ఈ జాబితాలో ప్రవేశించింది మలయాళ సినిమా. ఆశ్చర్యం ఏమంటే అలాంటి చోట ఏకంగా ఒక మహిళా ప్రధానమైన చిత్రం ఒకేసారి 200 కోట్లు దాటేసింది. కళ్యాణి ప్రియదర్శన్ నటించిన ఫాంటసీకి ఫెమినిజం జోడించి దుల్కర్ సల్మాన్ నిర్మించిన చిత్రం లోకా1 చంద్ర అరుదైన ఈ ఘనత సాధించింది. ఆమె తండ్రి ప్రియదర్శన్ ప్రముఖ దర్శకుడైతే తల్లి లిజీ కూడా నటీమణి. ఈ చిత్రం విజయంతో అటు మలయాళ చిత్ర సీమ, ఇటు మహిళా నటులు కూడా ప్రత్యేకంగా సంతోషిస్తున్నారట. డొమినిక్ అరుణ్ చిత్ర నిర్దేశకుడు, కథకుడు కూడా కాగా మహిళా చైతన్య రచయిత్రిగా పేరొందిన నటి శాంతి బాలచందర్ కథా సహకారం అందించారు. కల్కి 2 నుంచి దీపికా పదుకునే తప్పుకోవడం కూడా ఇలాగే సంచలనమైంది. ప్రభాస్‌తో నటించాల్సిన కల్కి2, స్పిరిట్ లను ఆమె అవలీలగా వదిలేశారు. ఆమె షరతులు, పారితోషకాలు రకరకాల కారణాలు చెబుతున్నా...ఓ బాహుబలి చిత్రాన్ని వదిలేయడం ఆమె తారాబలం చెబుతుంది. హీరాభిమానులకు మింగుడు పడదు కదా? ఇప్పుడు షీరోలు అంటున్నారందుకే.

శాపనార్థాలు, కోపతాపాలు

రాజకీయాలలో సమస్యలను మించి తిట్లు, శాపనార్థాలు పెరిగిపోతే ఏమవుతుంది? అసలు చర్చ దారి తప్పిపోతుంది. ప్రజా ప్రయోజనాలు వెనక పట్టు పడతాయి. ఎ.పి లో టిడిపి, వైసిపి మధ్య అచ్చంగా అదే జరుగుతున్నది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, యూరియా కొరత వంటి సమస్యలపై అందరూ విమర్శ చేస్తున్నారు. వామపక్షాలు ప్రజాసంఘాలు ఎప్పటి నుంచో ఉద్యమిస్తున్నాయి కూడా. అయితే వీటిపై విమర్శలకే పరిమితమైతే మసాలా డోసు సరిపోదు గనక మాటలు మీరుతుంటారు. కొద్ది రోజుల కిందట మాజీ సి.ఎం వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ యూరియా సరఫరా చేయలేక పోయినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బావిలో దూకి చావాలని సెలవిచ్చారు. గతంలోనూ ఆయన ఇలాంటి సుభాషితాలు పలక్కపోలేదు. గాలిలో ఎగిరి గాలిలోనే కలిసి పోతాడని చంద్రబాబు కూడా ప్రతిపక్ష నాయకుడుగా మాట్లాడిన సందర్భాలున్నాయి. వీటిని ప్రజలూ ఇతర పక్షాలూ హర్షించలేదు. అయినా వారు మారలేదు. బావిలో దూకమన్న దానిపై ఎం.ఎల్.సి పంచుమర్తి అనూరాధ ఈ రోజున మాట్లాడుతూ మీరే బావిలో దూకి చావాలని ఆప్షన్ ఆయనకే ఇచ్చారు. జగన్ శాసనసభకు రాకుండా ప్రతిపక్ష హోదా అడుగుతున్నందుకు చెంప పగలగొట్టాలని అచ్చెన్నాయుడు మరో ప్రత్యామ్నాయం వదిలారు. దూషణలు, శాపనార్థాలతో ఎవరికైనా ఏం ఒరుగుతుంది? చర్చ దారి తప్పుతుంది, అంతే.

– పీపీ

విశ్లేషణ

అంటురోగాలతో ఆరోగ్యాంధ్ర!

ప్రబలుతున్న అంటు రోగాలకు కారణాలేమిటో గుర్తించి, అరికట్టవలసిన పాలకులు ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలు మరుగు పరుస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నీటి కాలుష్యం కారణమని కళ్లకు కనిపిస్తున్నా, అదే కారణమని ప్రజలు గగ్గోలు పెడుతున్నా అంగీకరించడం లేదు. ఆహారం, మద్యం, ఆర్ఎంపీ వైద్యుల లోపాలంటూ నెపాన్ని ప్రజలపైకి నెట్టి తమ బాధ్యత నుండి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. తురకపాలెం మరణాలకు కారణం మెలియోయిడోసిస్ అని ఒకరోజు, యురేనియం అవశేషాలు కారణమని ఇంకో రోజు ప్రకటనలు చేస్తూ పాలకులు గందరగోళం సృష్టిస్తున్నారేతప్ప అత్యవసర చర్యలను మాత్రం చేపట్టడంలేదు. ముందే స్పందించి ఉంటే కొన్ని ప్రాణాలైనా నిలబడేవి. అందుకే వీటిని సర్కారీ హత్యలు అన్నా తప్పులేదు.



సిహెచ్. బాబూరావు



రాష్ట్రంలో ప్రజారోగ్యం పడకేసింది. ఆరోగ్యాంధ్ర తమ లక్ష్యమని ప్రకటనలు గుప్పిస్తున్న పాలకులను అంతు తెలియని అంటు రోగాలు నిలదీస్తున్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యం స్వచ్ఛాంధ్ర నినాదాన్ని అపహాస్యం చేస్తోంది. ఒకపక్క విష జ్వరాలు, మరోపక్క అతిసారతో అల్లాడుతున్న రోగులు, వీరికి తోడు కిడ్నీ బాధితులు. విష జ్వరాల రోగులతో రాష్ట్రమంతటా ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. విజయవాడలో అతిసార (డయేరియా)తో నలుగురు మృతి చెందారు. 800 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. గుంటూరు జిల్లా తురకపాలెంలో అంతుపట్టని వ్యాధులతో మూడు నెలల్లో 30 మంది పైగా మృత్యువాత పడ్డారు. గిరిజన ప్రాంతాల్లో జ్వరాలు మరింత తీవ్రంగా విజృంభిస్తున్నాయి.

విజయవాడలో పేదలు అత్యధికంగా నివసించే న్యూ రాజరాజేశ్వరి పేట పునరావాస ప్రాంతంలో గత 15 రోజుల నుండి వాంతులు, విరేచనాలతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ప్రతి ఇంట్లో అతిసార బాధితులే. ఒకరో ఇద్దరో కాదు. ఇంటిల్లపాదీ మంచమెక్కిన దయనీయ స్థితి. ఇప్పటికీ పూర్తిగా అదుపులోకి రాలేదు. వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గుంటూరు నగరాన్ని ఆనుకుని ఉన్న తురక పాలెం గ్రామంలో అంతుపట్టని రోగాల కారణంగా ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. ఈ వ్యాధులకు గురవుతున్న వారిలో అత్యధికులు పేదలు, దళితులు, బలహీన వర్గాల వారే. 30 సంవత్సరాల లోపు వారు మరణించడం మరింత బాధాకరం. అనేక కుటుంబాలు అనాథలయ్యాయి. వైద్యం కోసం ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించి, రూ.10 వేల నుండి రూ.4 లక్షల వరకు ఖర్చు పెట్టిన కుటుంబాలున్నాయి. మరికొందరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. ఉపాధి లేదు. కుటుంబం మొత్తం అతిసారకు గురై ఆసుపత్రుల పాలుకావడం ఆర్థిక భారమే కాదు, భరించలేని మనోవేదన కూడా. ఏ క్షణంలో ఏం జరుగుతోందోననే ఆందోళనతో ఉన్నారు.

గత సంవత్సరం విజయనగరం జిల్లా గుర్ల మండలంలో 14 మంది, విజయవాడలో పదిమంది అతిసారతో మరణించారు. అంతకుముందు గుంటూరులో పలువురు మృత్యువాత పడ్డారు. ఉద్దానం తదితర ప్రాంతాల్లో కిడ్నీ మరణాలు ఆగలేదు. రాష్ట్రంలో క్యాన్సర్ రోగులు, మరణాలు పెరిగాయి.

రోగ నిర్ధారణ చేయలేరా?

మీడియాలో వార్తలు వచ్చి...సిపిఎం, పలు పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు గగ్గోలు పెట్టేవరకు ప్రభుత్వంలో చలనం లేదు. వారాలు గడిచిపోతున్నా, ఇప్పటికీ వ్యాధుల వ్యాప్తికి సరైన కారణాలు నిర్ధారించలేదు. బృందాలు వచ్చాయి, వెళ్లాయి. నేతలు వచ్చివెళ్లారు. కానీ రోగ నిర్ధారణే చేయలేదు. ఇక అరికట్టేదెప్పటికో! వైద్య పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఈ కాలంలోనూ సకాలంలో వ్యాధులకు కారణాలు గుర్తించలేకపోవడం సిగ్గుచేటు.

బాధ్యత మరచి...

ప్రబలుతున్న అంటు రోగాలకు కారణాలేమిటో గుర్తించి, అరికట్టవలసిన పాలకులు ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలు మరుగు పరుస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నీటి కాలుష్యం కారణమని కళ్లకు కనిపిస్తున్నా, అదే కారణమని ప్రజలు గగ్గోలు పెడుతున్నా అంగీకరించడం లేదు. ఆహారం, మద్యం, ఆర్ఎంపీ వైద్యుల లోపాలంటూ నెపాన్ని ప్రజలపైకి నెట్టి తమ బాధ్యత నుండి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. తురకపాలెం మరణాలకు మెలియోయిడోసిస్ అని ఒకరోజు, యురేనియం అవశేషాలు కారణమని ఇంకో రోజు ప్రకటనలు చేస్తూ పాలకులు గందరగోళం సృష్టిస్తున్నారేతప్ప అత్యవసర చర్యలను మాత్రం చేపట్టడంలేదు. ముందే స్పందించి ఉంటే కొన్ని ప్రాణాలైనా నిలబడేవి. అందుకే వీటిని సర్కారీ హత్యలు అన్నా తప్పులేదు.

అందరి వైఫల్యమిది

మానవ వైఫల్యాలే కాదు. వ్యవస్థల వైఫల్యం. ప్రభుత్వ, పాలకుల, ప్రజాప్రతినిధుల వైఫల్యం ఈవిషయంలో స్పష్టంగా కనిపిస్తోంది. కింది స్థాయిలో ప్రజారోగ్యాన్ని పర్యవేక్షించాల్సిన సిబ్బందిని కుదించేశారు. ఉన్న పరిమిత సిబ్బంది సమాచారమిచ్చినా పై స్థాయిలో పట్టించుకునే నాథుడే లేడు.

ప్రభుత్వాసుపత్రులను నిర్వీర్యం చేసి...

కార్పొరేట్ వైద్యం మీద ప్రేమతో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను నిర్వీర్యం చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల, వైద్యేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయడం లేదు. బడ్జెట్ పెంచడం లేదు. ప్రజారోగ్యం క్షీణించిన తర్వాత హడావిడి చేయటం తప్ప దీర్ఘకాలిక చర్యలపై దృష్టే లేదు.

ఉత్తుత్తి హడావిడి

తమను ఎన్నుకున్న ప్రజలు అంతుచిక్కని వ్యాధులతో అల్లాడి పోతుంటే ప్రజా ప్రతినిధులు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. ముఖ్యమంత్రి కలెక్టర్ల సమావేశంలో అతిసారపై ఆరా తీసినట్లు, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు, యంత్రాంగాన్ని తట్టి లేపాలని సూచించినట్లు వార్తలు వచ్చాయి. అంటే యంత్రాంగం మొద్దు నిద్రలో ఉందని అంగీకరించటమే. ఇంత జరిగినా పాలకులు తమ బాధ్యతను మాత్రం గుర్తించటం లేదు. బిజెపికి చెందిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ వచ్చారు, వెళ్లారు. నిర్దిష్ట చర్యలు తీసుకున్నది లేదు. మతోన్మాద కార్యక్రమాలపై ఉన్న దృష్టి ప్రజారోగ్యంపై మాత్రం లేదు వారికి.

స్థానిక సంస్థలకు నిధులేవి?

మున్సిపాలిటీలు, పంచాయతీల్లో మంచినీటి సరఫరా, పారిశుధ్యం, దోమల నివారణ, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నది. ప్రభుత్వం నిధులు కేటాయించటం లేదు. బ్లీచింగ్ చల్లే దిక్కు లేదు. డంపింగ్ యార్డులు లేవు. చిన్న వర్షాలకే కాలనీలు మునిగిపోతున్నాయి. దోమల నివారణకు ప్రతి ఇంట్లో జనం ఖర్చు పెట్టుకోవడం తప్ప, ప్రభుత్వం, స్థానిక సంస్థలు చేతులెత్తేశాయి. డ్రోన్లతో దోమల నివారణ, దోమలపై యుద్ధం అంటూ హడావిడే తప్ప చేసేది శూన్యం. పట్టణాల్లో, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను విస్మరిస్తున్నారు. కనీస నిర్వహణ ఉండటం లేదు. మంచినీటి కాలుష్యంపై జనం గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే దిక్కు లేదు. మంచినీటి సరఫరా, పారిశుధ్య సిబ్బందిని పెంచకపోగా తగ్గించేస్తున్నారు. 2026లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పాలక కూటమి నేతలు సిద్ధమవుతున్నారు తప్ప ప్రజారోగ్య పరిరక్షణపై మాత్రం దృష్టి పెట్టటం లేదు. రాష్ట్రంలో ప్రజారోగ్యం క్షీణించటానికి ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు నైతిక బాధ్యత వహించాలి. చిన్న చిన్న కార్యక్రమాలను సైతం గొప్పగా, తమ ఘనతగా చాటుకునే పాలకులు, ప్రజల అనారోగ్యానికి, మరణాలకు మాత్రం బాధ్యత వహించరు. స్వచ్ఛ భారత్, స్వర్ణాంధ్ర, ఆరోగ్యాంధ్ర అంటూ ఊదర గొట్టడమే తప్ప చేస్తున్నది శూన్యం.

ప్రభుత్వ ప్రాధాన్యతలు మారాలి. 2047కి ప్రణాళికలు, వికసిత్ భారత్, క్వాంటమ్ వ్యాలీ, ప్రపంచ స్థాయి సౌకర్యాలు, సింగపూర్ తరహా రాజధాని అంటూ ఊక దంపుడు ఆపి... క్షేత్ర స్థాయిలో ప్రజారోగ్యం, సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి. రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి)లో 6 శాతం ఆరోగ్యానికి బడ్జెట్‌లో కేటాయించవలసి ఉన్నా, కనీసం 2.5 శాతం కేటాయిస్తామని మాట ఇచ్చినా, ఇప్పటికీ 1.5 శాతం కూడా ఖర్చు పెట్టడం లేదు. ప్రజారోగ్యానికి చైనాలో సగటున ఏడాదికి రూ.9,900, శ్రీలంక లాంటి చిన్న దేశం లోను రూ.5,300 ఖర్చు చేస్తుండగా మన దేశంలో మాత్రం రూ.2,600కే పరిమితం కావటం సిగ్గుచేటు. దక్షిణాదిలో ఎ.పి ఇతర రాష్ట్రాలు కంటే మరింత వెనుకబడి ఉండటం బాధాకరం.

తక్షణ చర్యలు చేపట్టాలి

ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు తక్షణ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు పెంచాలి. వైద్య సిబ్బందిని పెంచాలి. స్థానిక సంస్థల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ప్రభుత్వ వైఫల్యాల కారణంగా వ్యాపిస్తున్న అంతుచిక్కని వ్యాధులతో మరణించిన కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందిన వారందరి బిల్లులు పూర్తిగా ప్రభుత్వమే భరించాలి. అనారోగ్యానికి గురై ఉపాధి లేక అల్లాడుతున్న ప్రజలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలి. బాధిత ప్రాంతాల్లో నిత్యవసర సరుకులు అందరికీ అందించాలి. వ్యాధులను, అవి ప్రబలడానికిగల కారణాలను తక్షణమే నిర్ధారించాలి. బాధితులను గుర్తించి, ఉపశమనం కోసం తగు చర్యలు చేపట్టాలి. పౌర సమాజం ప్రజారోగ్య పరిరక్షణకై పాలకులపై ఒత్తిడి తేవాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు /

కాణిపాకంలో ఆక్టోపస్ మాక్ డ్రిల్

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ఆక్టోపస్ ఆధ్వర్యంలో రాత్రి ఆలయం మూసిన అనంతరం ఆక్టోపస్ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో పెంచకిషోర్ తెలిపారు. ఉగ్రవాద నిరోధక వ్యాయామం నిర్వహించడానికి పోలీసు శాఖ, రెవెన్యూ, అగ్నిమాపక, ఆరోగ్య శాఖల అధికారులు, ఏఎస్పీలు రాజశేఖర్ రాజు, నందకిషోర్, ఆక్టోపస్ డీఎస్పీ తిరుమలయ్య వారి ఆధ్వర్యంలో ఆలయ భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పి సాయినాథ్, సిఐ శ్రీధర్ నాయుడు, ఐరాల ఎమ్మార్వో లోకేశ్వరి పాల్గొన్నారు.

ఛాబహార్ ఓడరేవుపై తిరిగి ఆంక్షలు

- అమెరికా నిర్ణయం
- పోర్టులో భారత్ కార్యకలాపాలకు బ్రేక్

వాషింగ్టన్ : ఇరాన్‌లోని ఛాబహార్ ఓడరేవుపై గడచిన ఏడు సంవత్సరాలుగా ఆంక్షలను ఎత్తివేస్తున్న అమెరికా ఇప్పుడు వాటిని తిరిగి అమలులోకి తెస్తానని ప్రకటించింది. భారత్ ప్రస్తుతం ఈ ఓడరేవు ద్వారానే ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియాతో వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది. ఇప్పుడు తిరిగి ఆంక్షలను అమలు చేయాలని అమెరికా తీసుకున్న నిర్ణయంతో మన దేశానికి ఆ దారి మూసుకుపోయినట్లుగానే భావించాల్సి ఉంటుంది. ఈ నెల 29 నుంచి ఛాబహార్ ఓడరేవుపై అమెరికా ఆంక్షలు అమలులోకి వస్తాయి. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై తాజాగా ఆంక్షలు విధించడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశంగా కన్పిస్తోంది. దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అవలంబిస్తున్న 'గరిష్ట ఒత్తిడి' విధానానికి అనుగుణంగా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్ ఫ్రీడమ్ అండ్ కౌంటర్-ప్రొలిఫరేషన్ యాక్ట్ (ఐఎఫ్‌సీపీఏ) ప్రకారం ఓడరేవుపై విధించిన ఆంక్షలకు 2018లో మినహాయింపు ఇచ్చారు. ఇకపై ఓడరేవులో కార్యకలాపాలు సాగించే ఏ దేశమైనా అమెరికా ఆంక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ట్రంప్ ఫిబ్రవరిలో సంతకం చేసిన జాతీయ భద్రతా మెమొరాండం మేరకు విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. జో బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరించినప్పుడు ఛాబహార్‌లో ప్రభుత్వ రంగంలోని ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపీజీఎల్)కు కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి హక్కులు కల్పించే దీర్ఘకాలిక లీజు ఒప్పందంపై భారత్ సంతకం చేసింది. ఒప్పందం ప్రకారం ఈ లీజు ఒప్పందం పది సంవత్సరాలు అమలులో ఉండాలి. కానీ ట్రంప్ నిర్ణయంతో అది రద్దయింది.

రష్యా నుంచి చమురు కొనుగోలు చేయం

- ట్రంప్‌కు హామీ ఇచ్చిన బ్రిటన్ ప్రధాని

వాషింగ్టన్ : రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేసేందుకు బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. అంతేకాక ఆంక్షలు విధించడంలో భాగస్వామి అవుతానని కూడా చెప్పారని అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తున్న నాటో, యూరోపియన్ యూనియన్ దేశాలపై తాను విమర్శలు చేసినప్పుడు స్టార్మర్ 'ఇబ్బంది' పడ్డారని చెప్పుకొచ్చారు. బ్రిటన్ పర్యటన నుంచి స్వదేశానికి తిరిగి వస్తూ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ విలేకరులతో ముచ్చటించారు. ఉక్రెయిన్ గురించి స్టార్మర్ మీతో మాట్లాడారా అని విలేకరులు ప్రశ్నించగా రష్యా నుంచి యూరోపియన్ దేశాలు చమురును కొనుగోలు చేస్తుండడంపై బ్రిటన్ నేత కొంత ఇబ్బంది ఫీల్ అయ్యారని తెలిపారు. 'నేను యూరప్‌ను విమర్శించడం బ్రిటన్ ప్రధానిని ఇబ్బంది పెట్టింది. మీకు తెలుసు. నాటో దేశాలు, ఈయూ దేశాలు...మీరు ఏ పేరుతో అయినా పిలవండి. ఎందుకంటే వాటి మధ్య చాలా పోలికలు ఉన్నాయి.

జి-20 సదస్సుకు ఉపాధ్యాయుడు శ్రీనివాసదొర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
ఈనెల 15 నుంచి 19 వరకు న్యూఢిల్లీలో జరిగిన జి20 శిఖరాగ్ర సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుంచి అకడమిక్ డెలిగేట్‌గా కంటోన్మెంట్ మున్సిపల్ హై స్కూల్ నుండి హిందీ ఉపాధ్యాయులు ఎస్ శ్రీనివాస్ దొర పాల్గొన్నారు. ఈయనకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ బ్రాంచ్ ఆహ్వానం అందడంతో ఆయన ఐఇసి - 2025 జనరల్ మీటింగ్ లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్,ఎలక్ట్రానిక్ రంగంలో సాధించిన సాంకేతిక అభివృద్ధి ముఖ్యంగా భారత్ ఈ రంగాల్లో సాధించిన ప్రగతిపై అవగాహన పొందడానికి బిఐ ఎస్ సంస్థ కల్పించిన ఈ అరుదైన అవకాశంగా శ్రీనివాస్ దొర చెప్పారు.

'ఓబుళాపురం' సరిహద్దుల ఖరారుపై కమిటీ

- మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలి : సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ఓబుళాపురంలో గాలి బ్రదర్స్ అక్రమ మైనింగ్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. మైనింగ్ సరిహద్దుల ఖరారుపై జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. అక్రమ మైనింగ్‌పై మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది. ఈ కేసులో జగన్ ప్రభుత్వం ఇచ్చిన అఫిడవిట్‌ను ప్రస్తుత ప్రభుత్వం ఉపసంహరించుకుంది. గాలి బ్రదర్స్ మైనింగ్ చేసుకోవడానికి అనుమతించవచ్చంటూ 2022లో జగన్ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సరిహద్దు వివాదం ముగిసిందని, మైనింగ్ కొనసాగించడానికి గాలి బ్రదర్స్‌కు అనుమతి ఇవ్వాలని జగన్ సర్కార్ ఈ అఫిడవిట్‌లో పేర్కొంది. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో అమెకస్ క్యూరీ అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో అమెకస్ క్యూరీ అఫిడవిట్‌ను పరిగణలోకి తీసుకొని జగన్ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టుకు ఎపి తరుపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా, న్యాయవాది గుంటూరు ప్రమోద్ కుమార్ తెలిపారు. ఎపి, కర్ణాటక సరిహద్దుల మధ్య అక్రమంగా వేలాది టన్నులు ఇనుప ఖనిజాన్ని తవ్వి ఎగుమతి చేశారు. దీనిపై గాలి బ్రదర్స్‌కు వ్యతిరేకంగా అప్పట్లోని ఎపి ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. అప్పట్నుంచి గత 15 ఏళ్లుగా సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ విచారణ కొనసాగుతోంది.

రాజమండ్రి - తిరుపతికి ఎయిర్ సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: విమాన ప్రయాణికులకు శుభవార్త.. దసరా పండుగ పురస్కరించుకొని రాజమండ్రి నుంచి తిరుపతికి విమాన సర్వీస్ ప్రారంభించనున్నారు. అక్టోబర్ ఒకటో తేదీన ఈ విమాన సర్వీసును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా ప్రారంభిస్తారు. వారానికి మూడు దఫాలు ఈ సర్వీసు అందుబాటులో ఉంటుందని అలయన్స్ ఎయిర్ సర్వీస్ కంపెనీ ప్రకటించింది. ఇప్పటివరకు హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ,చెన్నై, బెంగళూరు, ఢిల్లీ ప్రాంతాలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు నడుస్తున్న విషయం తెలిసిందే. రాజమండ్రి తిరుపతికి మరో విమాన సర్వీసు వారానికి మూడు రోజులు మాత్రమే విమాన సర్వీసు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. వారంలో మంగళ, గురు, శనివారాల్లో రాజమండ్రి నుంచి తిరుపతికి విమానాలు నడవనున్నాయి. రాజమండ్రి నుంచి ఉదయం 9.40 గంటలకు బయల్దేరి 11.20 గంటలకు తిరుపతికి చేరుతుంది. ఇక తిరుపతి నుంచి ఉదయం 7.40 గంటలకు బయల్దేరి ఉదయం 9.25 గంటలకు రాజమండ్రికి చేరనుంది. ఈ మేరకు అలయన్స్ ఎయిర్ సర్వీస్ అధికారులు వివరాలు వెల్లడించారు.

ప్రిన్సిపల్‌పై విద్యార్థి దాడి

టిసి ఇచ్చి పంపించేసిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-శెట్టూరు
మందలించాడనే నెపంతో ప్రిన్సిపల్‌పై ఓ విద్యార్థి దాడి చేసిన ఘటన శుక్రవారం స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని క్రమశిక్షణతో మెలగాలని ప్రిన్సిపల్ మందలించాడు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి ప్రిన్సిపల్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ప్రిన్సిపల్ పోలీసు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ డిఇఒ శ్రీనివాసులు, డిఎస్‌పి రవిబాబు హుటాహుటిన శెట్టూరు మోడల్ స్కూల్ చేరుకుని ఆ ఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థికి టిసి ఇచ్చి బయటికు పంపించేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని, మిగతా విద్యార్థులను డిఎస్‌పి హెచ్చరించారు.



అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న లేఖర్లు

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

- రిజిస్ట్రేషన్ శాఖలో 2.0 రద్దు చేయాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖర్లు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్ నిర్వహించి నిరసన తెలిపారు. రిజిస్ట్రేషన్, సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ధర్నా చేసి, ఆయా అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఏలూరులో దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పివి సుబ్బారావు మాట్లాడారు. రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు, కక్షిదారుల పేర్లతో పబ్లిక్ డేటా ఎంట్రీ చేసే సమయంలో వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఒటిపి) అడుగుతుందని, దాని వల్ల కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎవరికి ఆధార్ కార్డు నంబర్లుగానీ, ఒటిపిలు గాని చెప్పొద్దని బ్యాంకు అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలియజేస్తున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్‌లో ఒటిపి పద్ధతి రద్దు చేయాలని కోరారు. ఆన్‌లైన్ క్రయ, విక్రయదారుల డేటా సబ్‌మిట్‌లో ఒటిపితో సంబంధం లేకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లా కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో దస్తావేజు లేఖర్లు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన డేటాబేస్ రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు చేయాలని అనకాపల్లి, చోడవరం, ఆనందపురం, భీమిలిలో డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లాలో రెండు రోజులపాటు 'పెన్ డౌన్' చేస్తున్నట్లు దస్తావేజు లేఖరుల తిరుపతి అధ్యక్షుడు ఎస్ భావజన్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలో, పశ్చిమగోదావరి జిల్లా, చిత్తూరు జిల్లాల్లో దస్తావేజు లేఖర్లు 'పెన్‌డౌన్' చేశారు.

గతం కంటే ఘనంగా దసరా ఉత్సవాలు

- మంత్రి ఆనం వెల్లడి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

గతం కంటే ఘనంగా దసరా మహోత్సవాలను నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. విజయవాడ కనక దుర్గమ్మ దేవస్థానం ఆధ్వర్యాన జరిగే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం నగరంలోని మోడల్ గెస్ట్ హౌస్‌లో వివిధ శాఖల మంత్రులు, అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు ఆనం, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎంపి కేశినేని శివనాథ్ తదితరులు పాల్గొన్నారు. అధునాతన క్యూ లైన్లు, హోల్డింగ్ ఏరియాలు, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, యాత్రికుల భద్రత, స్నాన ఘాట్ల వద్ద ఏర్పాట్లు, ప్రసాదాల పంపిణీ, అన్న ప్రసాదం, కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు, ప్రొటోకాల్ దర్శన సమయాలు... ఇలా వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. గతేడాది తొమ్మిది రోజుల్లో దాదాపు 13 లక్షల మంది వచ్చారని, ఈసారి ఆ సంఖ్య 20 లక్షలకు చేరే అవకాశాలున్నాయని అంచనా వేశారు. సమావేశం అనంతరం మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ... దసరా మహోత్సవాల్లో సామాన్యులకు పెద్దపీట వేస్తామన్నారు. విఐపి, వివిఐపి దర్శనాలను తగ్గిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రముఖులకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పిస్తామన్నారు. రిపోర్ట్ లేఖలపై వచ్చే వారు బంగారు వాకిలి నుంచే దుర్గమ్మను దర్శించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. మూలా నక్షత్రం, విజయ దశమి రోజుల్లో దర్శన సమయాన్ని 22 గంటలకు పెంచాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.



ఆకట్టుకున్న దసరా సాంస్కృతికోత్సవాలు

- హింసా రహిత సమాజం

– పర్యావరణ పరిరక్షణపై కళారూపాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

వివిధ అభ్యుదయ సంఘాలు, సంస్థల ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహిస్తున్న దసరా సాంస్కృతికోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. రెండు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో ప్రదర్శించిన కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 'హింసారహిత సమాజం - పర్యావరణ పరిరక్షణ' అనే థీమ్‌పై విభిన్న అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు, యువతీయువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. థీమ్‌కు అనుగుణంగా మహిళా సమస్యలు, వివక్ష, సమానత్వం, హింస, అక్రమ రవాణా, ఫోర్నోగ్రఫీ, సామాజిక సమస్యలు, మాదక ద్రవ్యాలు, పర్యావరణం, మత సామరస్యం తదితర అంశాలపై కళారూపాలు ప్రదర్శితమయ్యాయి. రెండో రోజు మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో జరిగిన ఉత్సవాల్లో వివిధ కళాశాలల నుండి సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పర్యావరణ శాఖ ప్రొఫెసర్ బ్రహ్మాజీరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన సంస్కృతీ సాంప్రదాయాలను భావి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి వేదికలు దోహదపడతాయని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.అనురాధ, దసరా సాంస్కృతిక ఉత్సవాల కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి మాట్లాడారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు.

హైస్కూలును దత్తత తీసుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిధిలో ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మాణ దశలో ఉన్న తిలక్ హాల్ పనులను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఎంపీ లాడ్స్ నుంచి రూ.50 లక్షల నిధులతో ఆడిటోరియం నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం క్లాసులకు వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కూర్చుని వారి నోటు పుస్తకాలను పరిశీలించారు. ఇక్కడి విద్యార్థులు పాఠశాల చరిత్రను తిరగరాసే రీతిలో ఉత్తమ ఫలితాలు కనబరచాలని కోరారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బట్టి మౌలిక వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సమస్యలపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. ఈ పాఠశాలను దత్తత తీసుకొని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్రంలో మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘ చరిత్ర గల ఈ పాఠశాలలో మరుగుదొడ్లు, సైన్స్ ల్యాబ్, గ్రౌండ్ తదితర సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ పాఠశాలలో చదివిన వారు దేశ, విదేశాల్లో ప్రస్తుతం ఉన్నారని, అంతటి ఘన చరిత్ర ఉన్న పాఠశాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. స్వచ్ఛాంధ్ర ఉద్యమ స్ఫూర్తితో ప్లాస్టిక్ ఫ్రీ స్కూల్స్ కోసం అందరూ సహకరించాలని కోరారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటిలో విషాదం

- కాలువలో కొట్టుకుపోయిన ఆటో
- ఆరేళ్ల చిన్నారి గల్లంతు
- మరో ప్రమాదంలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా రాయచోటిలో విషాదం చోటుచేసుకుంది. సాయంత్రం ఏడు గంటల నుంచి మొదలైన భారీ వర్షానికి నగరంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. కొత్తపేటలోని మున్సిపల్ పార్కు వద్ద ఉన్న లోతైన కాలువ మునిగిపోయింది. స్కూలు నుంచి విద్యార్థులను తీసుకువస్తున్న ఆటో డ్రైవర్ ఈ కాలువను గమనించకపోవడంతో వరద ఉధృతికి ఆటో కొట్టుకుపోయింది. అయితే ఈ ఆటోలు ఏడుగురు స్కూలు విద్యార్థులు ఉన్నారు. కొట్టుకుపోతున్న ఆటోను గమనించిన స్థానికులు ఆరుగురిని కాపాడారు. మరో విద్యార్థి (ఆరేళ్ల చిన్నారి) గల్లంతయ్యారు. ఆ చిన్నారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌ఎన్‌కాలనీ వద్ద ఓ బాలిక మురుగు కాల్వలో కొట్టుకుపోతుండగా ఆ చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నించిన చిన్నారి తల్లి, మరో యువకుడు గల్లంతయ్యారు. ఈ ముగ్గురు మృతదేహాలను అధికారులు వెలికితీశారు. వర్షాల ప్రభావం ఇలాగే ఉండాలని అధికారులు మంత్రి రాంప్రసాద్ ఆదేశించారు. రెస్క్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అనవసరంగా ప్రజలు బయటకు రావద్దని కోరారు. విద్యుత్ తీగలు తెగిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెంచాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పి, కలెక్టర్‌తో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజల్లో ఆగ్రహం

- మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైందని, వైసిపి చేపట్టిన చలో మెడికల్ కళాశాలల కార్యక్రమం విజయవంతమైందని మాజీ మంత్రి విడదల రజిని తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కార్యక్రమం నిర్వహించకుండా ఆంక్షలు పెట్టారని, అరెస్టులు చేస్తామని భయపెట్టారని, అయినా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైందని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మేల్కొనేదాక వైసిపి పోరాటం ఆగదని తెలిపారు. డాక్టర్లు కావాలన్న పేద విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం వమ్ము చేస్తోందని వివరించారు.

ఇంకెన్నాళ్లు జైళ్లలో బందిస్తారు!

- జంతర్‌మంతర్ వద్ద విద్యార్థి సంఘాల నిరసన
- సిఎఎ వ్యతిరేక నిరసనకారుల విడుదలకు డిమాండ్



జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అత్యంత అప్రజాస్వామ్యయుతంగా తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్‌సి), నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పిఆర్)కు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసనలు చేపట్టినవారిపై ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు నిలిపివేయాలని పలువురు సామాజిక కార్యకర్తలు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జవహార్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం (జెఎన్‌యుఎస్‌యు) ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు.

ఈ కార్యక్రమంలో జెఎన్‌యుఎస్‌యు నాయకులతో పాటు ప్రముఖ న్యాయకోవిదులు ప్రశాంత్ భూషణ్ వంటి సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎఎ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లను వ్యతిరేకిస్తూ శాంతియుత ప్రదర్శనలు చేపట్టినవారిపై ప్రధానంగా ఆదివాసీలను, దళితులను, మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని కేంద్రం దుర్మార్గపు చర్యలు చేపట్టిందన్నారు. కుట్రపూరితంగా అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తోందన్నారు. ఐదేళ్లుగా జైళ్లలో అన్యాయంగా బంధించిందన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఐక్యంగా మోడీ సర్కార్ నిరంకుశ చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

సిఎఎ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లను దేశ ప్రజానీకం ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల కిందట సిఎఎ వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్నవారిపై ఢిల్లీలో మత ఘర్షణలను ప్రేరేపించారంటూ అక్రమ కేసులను బనాయించారని, ఉమర్ ఖాలిద్, గుల్ఫిషా ఫాతిమా, అథర్ ఖాన్ తదితర విద్యార్థి సంఘాల నాయకులను, సాగర్ వంటి ఆదివాసీ కార్యకర్తలను, సర్జీల్, తస్లీమ్ అహ్మద్, తమీర్ హుస్సేన్ వంటి సామాజిక, రాజకీయ కార్యకర్తలను విచారణ పేరుతో కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తోందని విమర్శించారు. వీరందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉమర్ ఖలీద్, షార్జీల్ బెయిల్ పిటిషన్లు వాయిదా

2020 ఢిల్లీ అల్లర్ల కేసులో జెఎన్‌యు మాజీ స్కాలర్ ఉమర్ ఖలీద్, సామాజిక కార్యకర్త షార్జీల్ ఇమామ్‌ల బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం వాయిదా వేసింది. ఎటువంటి కారణం వెల్లడించకుండా.. ఈ పిటిషన్‌లపై సెప్టెంబర్ 22 (సోమవారం) విచారణ చేపడతామని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇమామ్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టుకు హాజరయ్యారు. సెప్టెంబర్ 2న బెయిల్‌ను నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పిటిషన్‌దారులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఉమర్ ఖలీద్, ఇమామ్‌లతో పాటు కార్యకర్తలు గుల్ఫిషా ఫాతిమా, ఖలీద్ సైఫీ, అథర్‌ఖాన్, మొహమ్మద్ సలీమ్ ఖాన్, షిఫా-ఉర్- రెహ్మాన్, మీరాన్ హైదర్ మరియు షాదాబ్ అహ్మద్‌లకు హైకోర్టు బెయిల్ నిరాకరించింది. మరో వ్యక్తి తస్లీమ్ అహ్మద్ బెయిల్ పిటిషన్‌ను కూడా అదే రోజు ప్రత్యేక బెంచ్ తోసిపుచ్చింది.

జాకీర్ హుస్సేన్ కాలేజీలో ఎస్‌ఎఫ్‌ఐ విజయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోని జాకీర్ హుస్సేన్ కాలేజీలో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఘన విజయం సాధించింది. జాకీర్ హుస్సేన్ ఢిల్లీ కాలేజ్ (ఈవినింగ్) విద్యార్థి సంఘం ప్రధానకార్యదర్శి పదవితో పాటు సెంట్రల్ కౌన్సిలర్ పదవులను ఎస్‌ఎఫ్‌ఐ సొంతం చేసుకుంది. ఢిల్లీ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్‌లోనూ ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, నాలుగు కార్యనిర్వాహక కమిటీ పదవులనూ కైవసం చేసుకుంది. కాగా ఢిల్లీ యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్ (డియుఎస్‌యు) అధ్యక్షునిగా ఆర్యన్ మాన్ (ఎబివిపి), కార్యదర్శిగా కునాల్ చౌదరి (ఎబివిపి), అలాగే సంయుక్త కార్యదర్శిగా దీపికా ఝూ (ఎబివిపి) ఎన్నికయ్యారు. డియుఎస్‌యు ఉపాధ్యక్షులుగా ఎన్‌ఎస్‌యుఐ అభ్యర్థి రాహుల్ ఝాంసలా గెలుపొందారు.

474 పార్టీలపై ఇసి వేటు

న్యూఢిల్లీ : ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో పాటు, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్న 474 నమోదిత రాజకీయ పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం తన జాబితా నుంచి తొలగించింది. గత ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనూ ఈ పార్టీలు పోటీ చేయకపోవడం, ఇసి నియమావళిలోని అనేక నిబంధనలను ఉల్లంఘించినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఆగస్టు 9న మొదటి దశలో గుర్తింపు పొందని 334 పార్టీలను తొలగించిన సంగతి తెలిసిందే. దీనికి కొనసాగింపుగా రెండో దశలో 474 పార్టీలను తొలగించింది. దీంతో ఎన్నికల సంఘం వద్ద నమోదై..గుర్తింపు పొందని పార్టీలు (ఆర్‌యుపిపి) 2,046 ఉన్నాయి. అలాగే జాతీయ పార్టీలుగా ఆరు, ప్రాంతీయ పార్టీలుగా 67 గుర్తింపు పొందిన పార్టీలున్నాయి.

అస్సామీ గాయకుడు గార్గ్ మృతి

గౌహతి : అస్సాంకు చెందిన ప్రఖ్యాత గాయకుడు జుబీన్ గార్గ్ (52) శుక్రవారం మృతి చెందారు. సింగపూర్‌లో స్కూబా డైవింగ్ చేస్తుండగా ఆయన గాయపడ్డారని, వెంటనే అస్పత్రికి తీసుకెళ్ళారని, కానీ ఐసియులో చికిత్స పొందుతూ మరణించారని సంబంధిత అధికారులు తెలిపారు. శుక్రవారం నుండి మూడు రోజుల పాటు జరగనున్న నార్త్ ఈస్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఆయన సింగపూర్ వెళ్లారు. గార్గ్ మృతి పట్ల అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి రాష్ట్రానికి, దేశానికి తీరని లోటని వ్యాఖ్యానించారు. అస్సామీ సంగీతానికి, సాంస్కృతిక రంగానికి గార్గ్ విశేషంగా సేవలందించారని అస్సాంకు చెందిన నటుడు ఆదిల్ హుస్సేన్ వ్యాఖ్యానించారు.

పహల్గాం దాడి కేసు.. దర్యాప్తు గడువు పొడిగింపు

జమ్మూ : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాం ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడి కేసు దర్యాప్తు గడువును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) ప్రత్యేక న్యాయస్థానం మరో 45 రోజులకు పొడిగించింది. ఈ కేసులో ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారనే ఆరోపణలపై అరెస్టయిన ఇద్దరు నిందితుల కస్టడీని కూడా కోర్టు పొడిగించింది. ఎన్‌ఐఎ ప్రత్యేక కోర్టు జడ్జి సందీప్ గందోత్రా ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ఫోరెన్సిక్, డిఎన్‌ఎ ప్రొఫైలింగ్ నివేదికలు, విచారణ పురోగతి, ఆరోపణలు వంటి కారణాలతో గతంలో ఇచ్చిన 90 రోజుల దర్యాప్తు గడువును మరో 45 రోజులు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. నిందితులు బషీర్ అహ్మద్ జోథట్, పర్వీజ్ అహ్మద్‌లకు గతంలో విధించిన 10 రోజుల జుడిషియల్ రిమండ్ శుక్రవారంతో ముగియడంతో ఈ ఇద్దర్నీ వర్చువల్ విధానంలో కోర్టు ముందు ఎన్‌ఐఎ అధికారులు హాజరుపర్చారు. వీరికి కస్టడీని పొడిగించారు. అలాగే, విచారణను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని దర్యాప్తు అధికారిని కోర్టు ఆదేశించింది.



ఆర్మీ చీఫ్ వేధిస్తున్నారు

- ఇమ్రాన్ ఖాన్ ఆరోపణ

లాహోర్ : ప్రస్తుతం జైల్లో ఉన్న తనను, తన భార్యను పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ శుక్రవారం తెలిపారు. 'మమ్మల్ని మానసికంగా కృంగదీసి లొంగిపోయేలా చేయడమే వారి ఏకైక ఉద్దేశ్య'మని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఇమ్రాన్ ఖాన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'మునీర్‌కు చెప్పేదొక్కటే.. మేము ప్రాణాలతో ఉన్నంత కాలం క్రూరత్వానికో.. నిరంకుశత్వానికో తలొగ్గం' అని పేర్కొన్నారు. దేశంలో చట్టవిరుద్ధ, ఫాసిజం వాతావరణాన్ని సృష్టించడానికి మునీర్ సైన్యాన్ని ఉపయోగిస్తున్నారని ఆయన విమర్శించారు. ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీసేందుకు మునీర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తరాలుగా పాక్‌లో నివసిస్తున్న ఆఫ్ఘనిస్థానీయన్లను బహిష్కరించారని, డ్రోన్ దాడులకు ప్పాలడ్డారని తెలిపారు. పాక్‌తో యుద్ధానికి దిగేలా వారిని రెచ్చగొట్టడానికి మునీర్ చర్యలు ప్రేరేపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు దేశ ఆర్థిక స్థితి కకావికలంగా ఉందని, రుణభారం రెట్టింపు అయ్యిందని తెలిపారు. ప్రజలు అప్పుల ఊబిలో చిక్కుకున్నారని వాపోయారు. ప్రజా సమస్యలపై ఈ నెల 27న పెషావర్‌లో చేపట్టే ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ కేసుల్లో గత రెండేళ్లుగా ఇమ్రాన్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే.

కాంగ్రెస్ వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలి

- సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ సూచన


సమావేశంలో మాట్లాడుతున్న దీపాంకర్ భట్టాచార్య

కోల్‌కతా : రాబోయే బీహార్ ఎన్నికల్లో సీట్ల సద్దుబాటు సందర్భంగా కాంగ్రెస్ మరింత వాస్తవిక దృక్పథాన్ని అనుసరించాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య సూచించారు. అలాగే ప్రతిపక్ష ఫోరంలో అతిపెద్ద భాగస్వామి అయిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)..చిన్న పార్టీలకు చోటు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 2020 ఎన్నికల్లో ప్రదర్శించిన పనితీరు నుండి పాఠాలు నేర్చుకుని వ్యవహరించాల్సిందిగా కాంగ్రెస్‌కు హితవు పలికారు. 243 సీట్లలో కనీసం 40 సీట్లకు పోటీ చేయాలని తమ పార్టీ భావిస్తోందన్నారు. గత ఎన్నికల్లో 19 సీట్లకు పోటీ చేసింది. ఒకవేళ ప్రతిపక్ష ఫోరం అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్‌ను పెట్టడానికి తమకెలాంటి అభ్యంతరం లేదని కూడా ఆయన పేర్కొన్నారు. సీట్ల సద్దుబాటుకు ఇంకా చర్చలు జరుగుతున్నాయన్నారు. బీహార్‌లో ఎస్‌ఐఆర్‌పై ఆందోళనల కారణంగా కొన్ని విషయాలు ఆలస్యమవుతున్నాయన్నారు. ఈ నెలాఖరు కల్లా స్పష్టత వస్తుందని చెప్పారు. ప్రస్తుతం ప్రతిపక్ష ఫోరంలో ఆరు పార్టీలు వున్నాయి. లోక్‌జన్‌శక్తి పార్టీ (పరస్), జార్ఖండ్‌ముక్తి మోర్చా (జెఎంఎం) కొత్తగా చేరేవీలుంది.

అస్సాం రైఫిల్స్ వాహనంపై దాడి

- మణిపూర్‌లో ఇద్దరు సైనికులు మృతి

ఇంఫాల్ : దాదాపు మూడేళ్లుగా హింసాకాండ రగులుతున్న మణిపూర్‌లో పరిస్థితులు ఎప్పుడు అదుపులోకి వస్తాయో తెలియడం లేదు. తాజాగా రాష్ట్రంలో అస్సాం రైఫిల్స్ వాహనంపై జరిగిన దాడిలో ఇద్దరు సైనికులు మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పత్సోయి కంపెనీ ఆపరేటింగ్ బేస్ నుంచి నంబోల్ కంపెనీ ఆపరేటింగ్ బేస్‌కు 33 అస్సాం రైఫిల్స్‌కు చెందిన దళాలతో వెళుతున్న వాహనంపై ఇంఫాల్ నగర శివారుల్లో శుక్రవారం సాయంత్రం 5:50 గంటలకు ఈ దాడి జరిగింది. గాయపడిన వారి పోలీసులు, స్థానికులు ఇంఫాల్‌లోని ఒక ఆసుపత్రికి తరలించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం సంఘటనా స్థలంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ) ఈ దాడికి పాల్పడినట్లుగా అనుమానిస్తున్నారు.

గాజాలో శాంతికి మళ్లీ మోకాలడ్డిన అమెరికా


- కాల్పుల విరమణ తీర్మానంపై ఆరోసారి వీటో


ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి రూపొందించిన తీర్మానాన్ని వీటో చేస్తున్నట్లు ప్రకటిస్తున్న అమెరికా మిడిల్ ఈస్ట్ దౌత్యవేత్త మోర్గాన్

న్యూయార్క్ : గాజాలో ఇజ్రాయిల్ దాడులకు తెర దింపాలని అంతర్జాతీయ సమాజం ముక్త కంఠంతో నినదిస్తుంటే అమెరికా మాత్రం అక్కడ శాంతియుత పరిస్థితులకు అస్కారం లేకుండా అమానవీయతను చాటుతోంది. గాజాలో తక్షణమే, బేషరతుగా, శాశ్వత కాల్పుల విరమణ జరగాలని, అలాగే గాజా ప్రజలకు అందే సాయంపై విధించిన ఆంక్షలన్నింటినీ ఇజ్రాయిల్ ఎత్తివేయాలని కోరుతూ భద్రతా మండలి ముసాయిదా తీర్మానం చేసింది. అయితే ఈ తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. 15 మంది సభ్యులు గల భద్రతా మండలిలో 10 మంది సభ్యులు రూపొందించడగా సమర్థిస్తూ 14 ఓట్లు వచ్చాయి. దాదాపు రెండేళ్లుగా సాగుతున్న గాజా యుద్ధంపై భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని అమెరికా ఇలా వీటో చేయడం ఇది ఆరవసారి. గాజాలో క్షామం ధృవీకరించబడిందని, అదేమీ అంచనానో, ప్రకటనో కాదని డెన్మార్క్ రాయబారి క్రిస్టినా మార్కస్ లాసెన్ వ్యాఖ్యానించారు. ఓటింగ్‌కు ముందు ఆమె మండలిలో మాట్లాడారు. ఇజ్రాయిల్ తీసుకుంటున్న చర్యలతో అక్కడ విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. మరోవైపు హమాస్ వల్లనే ఈ యుద్ధం జరుగుతోందని అమెరికా రాయబారి వ్యాఖ్యానించారు.

అవినీతిని అంతమొందిస్తాం.. జీవన ప్రమాణాలు పెంపొందిస్తాం

- నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కర్కి ప్రతిన



ఖాట్మండు : అవినీతిపై పోరాటం చేస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందిస్తామని నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీలా కర్కి శుక్రవారం ప్రతిన చేశారు. ఈ నెల ఆరంభంలో దేశంలో చెలరేగిన నిరసనలు, ఆందోళనలు యువతలోని అసహనాన్ని ప్రతిబింబించాయి. పెరుగుతున్న అవినీతి పట్ల వారిలో నెలకొన్న అసంతృప్తి బయటపడిందని ఆమె పేర్కొన్నారు. నేపాల్ జాతీయ దినోత్సవం సందర్భంగా ఆమె ప్రసంగించారు. పదేళ్ళ క్రితం ఇదే రోజు ప్రస్తుత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా సుపరిపాలన అందించడం, ప్రజా సంక్షేమ లక్ష్యాలు నెరవేర్చడంలో విఫలమైనందువల్లనే ఈ నిరసనలు, ఆందోళనలు చెలరేగాయన్న వాస్తవాన్ని మనం ఆమోదించాల్సిందేనని ఆమె అన్నారు. గత వారంలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సుశీలా కర్కి మొదటిసారిగా ఈ వ్యాఖ్యలు చేశారు. జీవన నాణ్యతను పెంచుతూ, ఉపాధి అవకాశాలను సృష్టించడానికి ప్రభుత్వం కట్టుబడి వుందని ఆమె చెప్పారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, అవినీతి నియంత్రణ, అభివృద్ధికి కట్టుబడి వున్నామన్నారు. మార్చి 5న అనుకున్నట్లుగా పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు.


పెన్నులు, పుస్తకాలు, స్కూలు బ్యాగులపై 18 శాతం జిఎస్‌టి

- 22 నుంచి అమలు

న్యూఢిల్లీ : పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర బోర్డు (సిబిఐసి) ఈ నెల 22 నుంచి సుమారు 1,200 వస్తువులపై జిఎస్‌టిని సవరిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం విద్యార్థులు ప్రతి రోజూ ఉపయోగించే పెన్నులు, స్కూలు బ్యాగులు, ముద్రించిన పుస్తకాలపై 18 శాతం జిఎస్‌టి విధిస్తారు. జిఎస్‌టి రేట్లను సవరిస్తూ ఈ నెల 3న తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నేపథ్యంలో గడువు లోగానే 28 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు కొత్త రేట్లను నోటిఫై చేసే అవకాశం ఉంది. బాల్ పాయింట్ పెన్నులు, ఫౌంటెన్ పెన్నులు, మార్కర్లు, ఇతర రాత పరికరాలపై గతంలో వేర్వేరు జిఎస్‌టి రేట్లు విధించారు. ఇప్పుడు వాటన్నింటి పైన 18 శాతం చొప్పున వసూలు చేస్తారు. స్కూలు బ్యాగులు, హ్యాండ్ బ్యాగులు, సూట్‌కేసులు, వ్యానిటీ కేసులు, సంగీత పరికరాల కేసులు, పర్యాటక బ్యాగులపై కూడా ఇదే విధంగా 18 శాతం జిఎస్‌టి విధిస్తారు.

కాగా రాసే సుద్ద (రైటింగ్ ఛాక్)ను, దర్జీ పనివారు ఉపయోగించే సుద్దను జిఎస్‌టి నుంచి పూర్తిగా మినహాయించారు. గతంలో వీటిపై 12 శాతం జిఎస్‌టి వసూలు చేసే వారు. ప్రింటెడ్ పుస్తకాలకు ఉపయోగించే అన్‌కోటెడ్ పేపర్‌ను 18 శాతం జిఎస్‌టి పరిధిలోకి తేవడం ఆందోళన కలిగిస్తోంది. లేబొరేటరీ నోట్‌బుక్స్‌ను జీఎస్టీ నుంచి మినహాయిస్తుండగా ప్రింటెడ్ పుస్తకాలపై విధించిన అధిక జిఎస్‌టితో పుస్తకాల ధరలు పెరుగుతాయని పరిశ్రమ నిపుణులు తెలిపారు.

అమెరికాలో ట్రంప్‌పై పెరుగుతున్న వ్యతిరేకత



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై వ్యతిరేకత పెరుగుతుందని తాజాగా నిర్వహించిన సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ది ఎకనామిస్ట్ సర్వే నివేదిక ప్రకారం. ట్రంప్ ప్రజాదరణ గత వారంతో పోలిస్తే 2.6 పాయింట్లు తగ్గింది. ఆయన పని శైలిని 39% మంది మాత్రమే ఆమోదిస్తున్నారు. 56% మంది అధ్యక్షుడి పనితీరుపై అసంతృప్తిగా ఉన్నారని పేర్కొంది. మరో 4% మందికి స్పష్టమైన అభిప్రాయం లేదని తెలిపింది. మరోవైపు రాయిటర్స్ ఇప్సోస్ గత వారం నిర్వహించిన సర్వే వివరాలను బుధవారం విడుదల చేసింది. ఈ నివేదికలో 42% మంది ట్రంప్ పనితీరును ఆమోదించగా, 56% మంది ఆయన పని తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారని ప్రకటించింది. అయితే 242 రోజుల పాలనలో ట్రంప్ రేటింగ్ తగ్గడానికి ఆయన తీసుకున్న సుంకాల విధానాలు, విదేశాంగ విధానం, కఠినమైన వలస విధానాలు, ప్రభుత్వ ఉద్యోగాలకు భారీ కోతలు, విద్యా సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం వంటివి తాజాగా నిర్వహించిన సర్వేలో ఆయన రేటింగ్ పడిపోడానికి కారణాలని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

ట్రంప్ విధానాలపై ఆగ్రహం...

తొమ్మిది నెలలుగా సాగుతున్న ట్రంప్ పాలనపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. వాణిజ్య ఒప్పందాలు, ముఖ్యంగా వలస విధానాన్ని అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. దీంతో పాటు ట్రంప్ తన ప్రసంగాల్లో న్యాయశాఖ, అమెరికన విశ్వవిద్యాలయాలు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, మీడియా తదితర సంస్థలపై కూడా దాడి చేశారు. ఆయన దూకుడు శైలిపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోందని తెలుస్తుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే అమెరికా వ్యాపారాలను పెంచాలంటూ అనేక దేశాలపై సుంకాలు విధించారు. దీంతో ద్రవోల్బణం పెరిగిపోయింది.. దీంతో ఉత్పత్తులు ఖరీదైయ్యాయి. అంతేకాకుండా అలర్లు జరుగతున్నాయనే నెపంతో లాస్ ఏంజెల్స్, వాషింగ్టన్ వంటి ప్రదాన నగరాల్లో నేషనల్ గార్డులను మోహరించడంతో అమెరికన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ట్రంప్ సుంకాలు భారత్, అమెరికా సంబంధాలను దెబ్బతీశాయి. గత అమెరికా అధ్యక్షులు ఇతర దేశాలతో సత్సంబంధాలను మెరుగుపరచడానికి కృషి చేస్తే , ట్రంప్ విధానాలతో మరింత దూరం పెరిగిందని అమెరికా నిపుణులు విమర్శిస్తున్నారు.

రైతులను నేరస్తులుగా ముద్ర వేస్తారా !

- సుప్రీం వ్యాఖ్యలపై ఎఐకెఎస్ విచారం

న్యూఢిల్లీ : పొలాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టే రైతులను అరెస్టు చేయాలంటూ సుప్రీంకోర్టు బుధవారం చేసిన వ్యాఖ్యల పట్ల అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో అనూహ్యంగా సంభవించిన వరదల తాకిడికి గురై నష్టపోయిన రైతాంగం పట్ల సున్నితంగా వ్యవహరించకుండా అనుచితంగా ప్రవర్తించడంగా ఈ చర్యను ఎఐకెఎస్ భావిస్తోందని పేర్కొంది. వరి పంటలో గణనీయమైన భాగం ఇప్పటికే నీట మునిగి వుందని, అందువల్ల ఈసారి పొలాల్లో వ్యర్థాలను తగలబెట్టేందుకు ఎలాంటి అవకాశం లేదని ఆయా రాష్ట్రాల న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తెలియచేయాలని పేర్కొంది. రైతులకు జరిమానాలు విధించడం లేదా అరెస్టు చేయడం వంటి శిక్షాత్మక చర్యలు తీసుకోవడానికి బదులుగా పంట కోతలకు ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వాలు అభివృద్ధిపరచాల్సిన అత్యవసర పరిస్థితి వుందని రైతు సంఘాలు నొక్కి చెబుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా రబీ పంటకు విత్తనాలు వేసుకోవడానికి వీలుగా రైతులు తమ పంట పొలాలను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం వుందని అర్థం చేసుకోవాలని కోరింది. పొలాల్లోని పంట వ్యర్థాలను ప్రత్యామ్నాయ పారిశ్రామిక ఇంధనంగా ఉపయోగించే సాంకేతికతను గతంలో రూపొందించారని, కానీ ఆయా ప్రభుత్వాలకు రాజకీయ సంకల్పం కొరవడడం వల్ల అమల్లోకి రాలేదని ఎఐకెఎస్ పేర్కొంది. పర్యావరణ కాలుష్యానికి ఇదొక్కటే కారణం కాదని ఎఐకెఎస్ పునరుద్ఘాటించింది. పరిశ్రమలు, రవాణా, బాణాసంచా, నిర్మాణ కార్యకలాపాలు ఇవన్నీ కూడా ఇతోధికంగా దోహదపడు తున్నాయని పేర్కొంది. భవిష్యత్తులో ఇలా పంట వ్యర్థాలను తగలబెట్టడాన్ని నేరంగా పరిగణించబో మని 2021 డిసెంబరులో ఎస్‌కెఎంకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ రాతపూర్వకంగా ఇచ్చిన హామీని గుర్తు చేసుకోవాలని కోరింది. వరదల కారణంగా ప్రజల ప్రాణాలు కోల్పోవడమే కాకుండా పశువులు, పంటలను కూడా తీవ్రంగా నష్టపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో రైతులను నేరస్తులుగా చిత్రీకరిస్తూ వారిని అరెస్టులు చేస్తామనే బెదిరింపులు జారీ చేయడం కన్నా వారెదుర్కొంటున్న ఇబ్బందులను పంచుకోవాలని ఎఐకెఎస్ కోరుతోంది. పర్యావరణ కాలుష్యం పట్ల సమగ్ర దృక్పథంతో వ్యవహరించాలని, పర్యావరణాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలను ఆదేశించాలని కోరింది.

పేపర్ కప్‌లూ ప్రమాదమే!

- పంచాయతీ స్థాయిలో ప్రజా చైతన్యానికి నడుం బిగించిన కేరళ సర్కార్
- గ్లాస్, స్టీల్ పాత్రలే వాడాలి


మంత్రి ఎంబి రాజేష్

తిరువనంతపురం : ప్లాస్టిక్ ఫుడ్ కంటెయినర్లకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్న పేపర్ కప్‌ల వల్ల ఎదురవుతున్న ముప్పులను కేరళ అసెంబ్లీ గుర్తించింది. కంటికి కనిపించని రీతిలో మైక్రో ప్లాస్టిక్స్, విషపూరితమైన లోపలి పూత వల్ల ఈ పేపర్ కప్‌లు కూడా ప్రమాదకారిగానే తయారయ్యాయని అసెంబ్లీ శుక్రవారం ప్రముఖంగా పేర్కొంది. ప్రజల్లో దీనిపట్ల చైతన్యం తీసుకువచ్చేందుకు వీలుగా పంచాయితీ స్థాయిలో ప్రజా చైతన్య ప్రచారం మొదలుపెడుతున్నట్లు స్థానిక సంస్థల శాఖ మంత్రి ఎంబి రాజేష్ ప్రకటించారు. ప్లాస్టిక్‌కు బదులుగా గ్లాస్, స్టీల్ పాత్రలను ఉపయోగించేలా ప్రజల్లో అవగాహన పెంచాలని, ఇందుకోసం ప్రచారం చేపట్టాలని కోరారు. ముఖ్యంగా వందమందికి పైగా హాజరయ్యే కార్యక్రమాల్లో ఇది తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. యూజ్ అండ్ త్రో సంస్కృతికి కేరళ వ్యతిరేకమన్నారు. అయితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్లాస్టిక్ కప్పులను, బ్యాగ్‌లకు పన్ను మినహాయింపులు ఇస్తోందని, ఈ చర్య క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ వ్యతిరేక పోరాటాన్ని బలహీనపరుస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

పేపర్ కప్పు భూమిలో కలవడానికి వందేళ్ళు !

ఫాస్ట్‌ఫుడ్ దుకాణాల నుండి ఇంటికి వేడిగా వుండే పదార్థాలను తీసుకెళ్ళడానికి ఉపయోగించే వాటితో సహా ఇటువంటి ఉత్పత్తుల వాడకం బాగా పెరిగిపోయిందని, దీనివల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావాలు పడడమే కాకుండా పర్యావరణపరంగా కూడా తీవ్ర ముప్పు పొంచి వుందంటూ స్థానిక సంస్థల శాఖ మంత్రి ఎం.బి.రాజేష్ దృష్టికి జనతాదళ్ (సెక్యులర్) ఎంఎల్‌ఎ మాథ్యూ థామస్ తీసుకెళ్ళారు. సాంప్రదాయసిద్ధంగా వాడే పాత్రలకు బదులుగా చవకగా దొరికే, సులభంగా వాడి పారేసే పేపర్ కప్‌లు వాడకం అన్ని ఫంక్షన్లలో, కార్యకలాపాల్లో పెరిగిందని థామస్ పేర్కొన్నారు. ఆ కప్‌ల్లో వాడే లోపలి పూతలో భారీ లోహాలు, మైక్రో ప్లాస్టిక్స్ ఆనవాళ్ళు వుంటాయన్నారు. అటువంటివాటిల్లోని ఆహారం తిన్నందువల్ల తెలియకుండానే ప్రజల శరీరంలోకి అవన్నీ వెళ్ళిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కప్పులు, పాత్రలు, ప్లేట్లు, చేతి సంచులు ఇవన్నీ పార్కులు, బీచ్‌లు, గార్డెన్లు, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ చూస్తే అక్కడ కుప్పలుగా పడి వుంటున్నాయని వీటిని శుభ్రపరచడం మున్సిపల్ సిబ్బంది భారంగా మారుతోందని అన్నారు. పేపర్ కప్పులు తొందరగా భూమిలో కలిసిపోతాయనే భావన ప్రజల్లో వుందని కానీ ఒక కప్పు నేలలో కలిసిపోవడానికి వంద సంవత్సరాలు పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పీకర్ షంషీర్ కూడా ఆందోళన చెందుతూ మాట్లాడారు.

పాక్‌లో పేలుళ్లు ..11 మంది మృతి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో జరిగిన వేర్వేరు పేలుళ్లలో 11 మంది మరణించారు. ఇరాన్‌కు సరిహద్దుల్లోని దస్త్ పట్టణానికి సమీపంలో భద్రత దళాల కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి బాంబు పేలుడులో ముగ్గురు సైనికులతో సహా ఐదుగురు మృతి చెందారు. పేలుడు పదార్థాలతో నిండిన కారుతో కాన్వాయ్‌ను ఢీ కొన్నారు. ఈ దాడికి వేర్పాటువాద సంస్థ బలూచ్ లిబరేషన్ ఆర్మీ బాధ్యత వహించింది. ఇదే ప్రావిన్స్‌లోని ఆఫ్ఘనిస్తాన్ బోర్డర్ క్రాసింగ్‌కు సమీపంలో జరిగిన మరొక పేలుడులో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. గురువారం ఈ పేలుడు ఘటనలు జరిగినట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. బలూచిస్తాన్‌లో గతకొన్నేళ్లుగా వేర్పాటువాదులు పాకిస్తాన్ సైన్యానికి వ్యతిరేకంగా దాడులకు పాల్పడుతున్నారు. ఈ నెల ప్రారంభంలో బలూచిస్తాన్ రాజధాని క్వెట్టాలో ఒక రాజకీయ ర్యాలీపై ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ జరిపిన ఆత్మాహుతి బాంబు దాడిలో 15 మంది మరణించారు.

భారత్-పాక్ ఘర్షణను పరిష్కరించా

- ట్రంప్ నోట మళ్లీ అదేమాట

లండన్ : ఈ ఏడాది ప్రారంభంలో భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనలో జోక్యం చేసుకొని దానిని పరిష్కరించానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి పునరుద్ఘాటించారు. తాను భారత్‌కు చాలా సన్నిహితుడినని, ప్రధాని నరేంద్ర మోడీతో బలమైన వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ భారత్‌పై యాభై శాతం సుంకాలు విధించానని తెలిపారు. బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్‌తో కలిసి ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న ఘర్షణ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ తనకు అతి పెద్ద అసంతృప్తి కలిగించారని వ్యాఖ్యానించారు. 'చమురు ధరలు తగ్గితే పుతిన్ యుద్ధాన్ని ఆపేస్తారు. ఆయనకు అంతకంటే వేరే దారి లేదు. ఆయన యుద్ధం నుంచి వైదొలుగుతారు' అని చెప్పారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై స్తంభించిన మండలి

(మొదటిపేజీ తరువాయి)

టిడిపి సభ్యులు శ్రీకాంత్, చిరంజీవిరావు, కావలి గ్రీష్మ, రామ్‌గోపాల్ రెడ్డి, అనూరాధ వైసిపికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని ఛైర్మన్ పోడియం వద్దకు చేరుకున్నారు. ఇరుపక్షాలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. కొంతసేపటి తరువాత టిడిపి సభ్యులు వారి స్థానాల్లోకి వెళ్లి కూర్చున్నారు. మెడికల్ కళాశాలలపై ఈ సమావేశాల్లోనే చర్చించేందుకు ప్రభుత్వం ఒప్పుకుందని, సభ్యులు సభ జరిగేందుకు సహకరించాలని వైసిపి సభ్యులను ఛైర్మన్ కోరారు. జిఎస్‌టిపై ఆర్థికశాఖ మంత్రి ప్రకటన ఉందని చెప్పిన ఆయన ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను దీనిపై మాట్లాడాలని కోరారు. సభ నియంత్రణలో లేకుండా తాను మాట్లాడలేనని మంత్రి పయ్యావుల తెలిపారు. జిఎస్‌టి స్టేట్‌మెంట్ సోమవారమైనా ఇస్తామన్నారు. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్టేట్‌మెంట్, మెడికల్ కళాశాలలపై సోమవారం చర్చిద్దామని చెప్పారు. వైసిపి సభ్యుల ఆందోళనలు కొనసాగడంతో సభను ఛైర్మన్ సోమవారానికి వాయిదా వేశారు.

జీవన సౌరభం

ధైర్యంగా వేసే ప్రతి అడుగులోనూ భయపెట్టే విమర్శలే వస్తుంటాయి. వింటూ ఆగిపోవడమా లేక ముందుకు సాగిపోవడమా అనేది నీ అడుగులోనే ఉంటుంది.

మీ కోసం

బంగాళదుంప వేపుడు చేసేటప్పుడు ఉప్పునీళ్లలో ముక్కలను ఓ అరగంట నానబెడితే కూర రుచిగా ఉంటుంది.



వాన



వానా వానా వచ్చింది
అందాలెన్నో తెచ్చింది
ఆనందాలను పంచింది

మొక్కలకు ప్రాణం పోసింది
చెట్లను ఎన్నో తడిపింది
వాగులనెన్నో నింపింది
ఎదలను ఎన్నో మీటింది

పిల్లలంతా
కదిలారు
చరవాణీ పక్కకు
విసిరారు
చేయీ చేయీ
కలిపారు
మొక్కలనెన్నో
నాటారు

పక్షులు పాటలు పాడాయి
నెమళ్ళు నాట్యం చేశాయి
గాలులు గుసగుసలాడాయి
జలాలు గలగల పారాయి


రైతులు నాగలి పట్టారు
నేలను చదును చేశారు
బీజములన్నీ విత్తారు
బాధలనన్నీ మరిచారు

వానా వానా వచ్చింది
అందాలన్నో తెచ్చింది
ఆనందాలను పెంచింది

– ముక్కామల జానకీరామ్,
63053 93291.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే ఆంగ్లంలో వాటి పేర్లూ ఇచ్చాం. అయితే ఆ పదాల్లో కొన్ని అక్షరాలను ఇవ్వలేదు. సరైన అర్థం వచ్చేలా ఆ అక్షరాలను మీరు రాయండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ





కె.నాగశ్రీ,
5వ తరగతి,
ఎంపిపిఎస్ కాశీపాడు,
పల్నాడు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

భయం వదిలి .. పద ముందుకు ...



జీవితంలో ప్రతి మనిషి తాను చేసే ప్రతి పని విజయవంతంగా పూర్తి కావాలని కోరుకుంటాడు. ఎందుకంటే ఆ స్ఫూర్తే మనసును ఆనంద పరుస్తుంది. సంతోషాన్ని పెంచుతుంది. ఉత్సాహాన్ని నింపుతుంది అందుకే 'అపజయం' అంటేనే మనసు భయంతో ఆమడ దూరం పరుగులెడుతుంది. దీనినే ఫియర్ ఆఫ్ ఫెయిల్యూర్ లేదా 'అతిచిఫోబియా' అంటారు.

మనిషి మనసు అపజయం అంటే ఎందుకు భయపడుతుంది? ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులు, యువతలో ఎక్కువగా ఇలాంటి భయాలు పొడచూపుతున్నాయి. కుటుంబ, సామాజికపరంగా అపజయమనేది అవమానాలకు, హేళనలకు, తలదించుకునే పరిస్థితులకు కారణమవుతుందనే ఒక బలమైన భయంతో కూడిన భావన. అలాగే విజయ శిఖరాలు ఎక్కే వ్యక్తులు అందుకునే గౌరవ మర్యాదలను ప్రత్యక్షంగా చూడటం, వినటంతో విజయం సాధించకపోతే అవమానం తప్పదనే భావం మనసులో నాటుకుపోతుంది.


భయాలకు మూలాలు : భయం అనేది బాల్యంలో కుటుంబం నుంచే ప్రారంభమై – జీవితాంతం మనిషి మనసులో కలిసి ప్రయాణం చేస్తుంది. తమ కుటుంబాల్లో ఉన్న పిల్లల్లో ఎవరైనా చదువుల్లో, ఆటల్లో లేదా ఏదైనా పనుల్లో విజయం సాధించినప్పుడు పెద్దల మెచ్చుకోళ్ళు కనిపిస్తాయి. అపజయాల్లో జయం సాధించిన వారితో పోలుస్తూ పొందే అగౌరవాలు, అవమానాలు పిల్లల హృదయాల్లో ముద్ర వేసుకుంటాయి. అపజయమంటే అనేది మహాపరాధంగా, పాపంగా, నేరంగా భావిస్తూ అదొర ఫోబియాగా మారుతుంది. ఇక్కడ ఒక విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. భయమనేది ప్రతి మనిషిలో చాలా సహజమైన ఉద్వేగం. కానీ, ఫోబియా అనేది కొన్ని విషయాల పట్ల అతిగా ఉద్వేగం లేదా స్పందనకు గురై భయానికి లోను కావటం. అంటే నిజంగా పాము కనిపించితే కలిగే భయం ఎవరికైనా చాలా సహజం. అలా కాకుండా పాముని తలుచుకోగానే భయంతో వణకటం అతి స్పందన అవుతుంది. ఇదే కొందరిలో కొన్ని సందర్భాల్లో మానసిక ఇబ్బందులను కూడా తెచ్చి పెడుతుంది. చదువుల్లో, ఆటల్లో, వివిధ వృత్తుల్లో, ఉద్యోగాల్లో పెరిగే పోటీతత్వాల కారణంగా ఈ అపజయం తాలూకా భయాలు వెన్నాడుతూనే ఉంటాయి. అగ్నికి ఆజ్యంలా బుల్లితెరలు, పెద్ద తెరలు, సోషల్ మీడియాల్లో విజయం తాలూకూ పొగడ్తలు, అందుకొనే కీర్తి శిఖరాలు అపజయాల వల్ల కలిగే అవమానాలు, అఘాయిత్యాల దృశ్య ప్రభావాలు కూడా మానసిక సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. దీంతో, విజయమే ఆరాధ్యంగా, అపజయం అనేది అంతిమ సంస్కారంగా భావించే పరిస్థితులు నెలకొంటున్నాయి. విజయం అనేది జీవితంలో మనిషికి మొదటి మెట్టు కాదు. అపజయం అనేది ఆఖరి మెట్టూ కాదు. ఇవన్నీ జీవితంలో అత్యంత సహజమైన విషయాలు. ప్రయత్నం చేయాలి తప్ప ప్రతి ప్రయత్నం గొప్ప విజయంగా మారాలి అనుకోకూడదు. అందరూ పరుగు పెడతారు. ఒకరో ఇద్దరో ముందు ఉంటారు. పరుగు పెట్టటాన్ని ఆస్వాదించాలి. అలాంటి స్వభావాన్ని పిల్లల్లో ప్రోత్సహించాలి. కింద పడ్డ ప్రతిసారి పట్టుదలతో పైకి లేచే ప్రయత్నానికి కావాల్సిన ఆత్మస్థైర్యం కలిగించాలి.



జాగ్రత్తగా అర్థం చేసుకుంటే– జీవితంలో 'ఫెయిల్యూర్స్' అయినా, 'సక్సెస్'లైనా మనం తెచ్చిపెట్టుకున్నవే! వాస్తవానికి ఈ రెండూ మనం భవిష్యత్తులో తిరిగి సాధించటానికి పనికి వచ్చే 'ఫీడ్‌బ్యాక్' మాత్రమే! విజయం సాధించిన వ్యక్తులు అదే స్థాయిని చివరివరకు కొనసాగిస్తారని చెప్పలేం! అపజయం పొందిన వ్యక్తులు చివరి వరకు అవే అపజయాలు పొందుతారని అనుకోలేం. ఇంకొక విషయం... జీవితమంతా ఎలాంటి అపజయాలు లేకుండా విజయ పరంపరలు సాధించిన వారు ఎందరుంటారు? జీవితం గెలుపు ఓటముల సమాహారం. వీడని ప్రయత్నాలే విజయ సోపానాలను అధిరోహింప చేస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. దీనికి మన ముందర కోకొల్లలుగా ఎన్నెన్నో ఉదాహరణలున్నాయి. పుట్టుకతోనే చేతులు లేని జెస్సికా కాక్స్ అనే ఒక అమెరికన్ యువతి ప్రపంచంలో మొట్టమొదటి లైసెన్స్ విమాన పైలెట్. ప్రమాదవశాత్తూ అంగవైకల్యం పొంది కాలు కోల్పోయిన సుధాచంద్రన్ ఒక గొప్ప నాట్యకళాకారిణి. ఆమె జీవితం ఆధారంగానే 'మయూరి' అనే సినిమా వచ్చింది. తెలుగు పాటకు తేనెలద్దిన మహా గాయకుడు ఘంటసాల వారి గొంతు పాటకు పనికి రాదని తోసి పుచ్చింది హెచ్‌ఎంవి రికార్డింగ్ సంస్థ. తర్వాత కాలంలో ఆ సంస్థ నుంచే ఆయన అద్భుతంగా పాడిన కొన్ని వేల పాటలు రికార్డులుగా వచ్చాయి. 'బల్బ్' కనిపెట్టటంలో వందకు పైగా వైఫల్యాల తరువాతనే ప్రపంచాన్ని వెలుగులతో నింపాడు థామస్ ఆల్వా ఎడిషన్. పదుల సంఖ్యలో అపజయం పాలైన కూడా చివరకు అమెరికన్ ప్రెసిడెంట్ అయిన 'అబ్రహం లింకన్' మనకు స్ఫూర్తే. అంగవైకల్యాలు, ఆర్థిక వెనుకబాట్లు లాంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా వీరి ధృఢ సంకల్పాలు వారి విజయాలకు అడ్డుకట్ట వేయలేకపోయాయి.



అపజయం ఓటమి కాదు; తిరిగి ప్రయత్నం చేయకపోవటమే నిజమైన అపజయమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. అందుకే జీవితంలో అపజయ భయాలను అధికమించే ప్రయత్నాల ప్రణాళికలను తయారు చేసుకోవాలి. అదే సందర్భంలో అపజయ భయాలు బాల్యం నుంచే అధిగమించే విధంగా కుటుంబపరంగా, పాఠశాలల పరంగా, సామాజిక మాధ్యమాల పరంగా తోడ్పాటునివ్వాలి. చిన్నతనం నుంచే గెలుపు, ఓటముల గురించి ఎలాంటి వ్యత్యాసం చూపకుండా వ్యవహరించాలి. ప్రయత్నం చేయటాన్ని ప్రోత్సహించాలి. అప్పుడు ప్రతి ఒక్కరూ వారు సమాజపరంగా ఎదురయ్యే ఒడిదుడుకులను, ఒత్తిళ్లను తట్టుకుని జీవితంలో రాణిస్తారు. ధైర్యంగా జీవిస్తారు.



–అమరనాథ్ జగర్లపూడి
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్,
సెల్ : 9849545257

ఆంధ్రా కింగ్ పాత్రలో ఉపేంద్ర



రామ్ పోతినేని నటిస్తున్న కొత్త సినిమా 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేష్‌బాబు పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో ఉపేంద్ర ఆంధ్రాకింగ్‌గా కనిపించనున్నారు. ఉపేంద్ర బర్త్‌డే సందర్భంగా 'హ్యాపీ బర్త్ డే ఆంధ్రా కింగ్' అంటూ మేకర్స్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. సూపర్‌స్టార్ అవతార్‌లో ఉపేంద్ర అభిమానులకు అభివాదం చేస్తూ కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. ఇందులో డై-హార్డ్ సినిమా ఫ్యాన్‌గా రామ్ అలరించబోతున్నారు. ఇది ఒక అభిమాని బయోపిక్‌గా ఉండబోతోంది. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ కీలక పాత్రలను పోషిస్తున్నారు. ఈ సినిమా నవంబర్ 28న విడుదల కానుంది. కథ–స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మహేష్‌బాబు పి, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్.



21న నడిగర్ సంఘం సమావేశం

దక్షిణ భారత నటీనటుల సంఘం (నడిగర్ సంఘం) 69వ సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన జరుగనుంది. తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో జరిగే ఈ సమావేశానికి ఆ సంఘం అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తి, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్, నడిగర్ సంఘ కార్యవర్గం, సర్వసభ్య సభ్యుల సహా 3 వేల మంది హాజరు కానున్నారు. ఉదయం 8.30 గంటలకు కార్యవర్గ సమావేశం, ఆ తర్వాత సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇందులో నడిగర్ సంఘ నూతన భవన ప్రారంభోత్సవం, సంఘం ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై చర్చించనున్నారు. నడిగర్ సంఘానికి ప్రతి మూడేళ్ళకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. 2019లో జరిగిన ఎన్నికల ఫలితాలను న్యాయపరమైన చిక్కుల కారణంగా 2022లో వెల్లడించారు. అధ్యక్షుడిగా నాజర్, ప్రధాన కార్యదర్శిగా విశాల్, కోశాధికారిగా కార్తిలతో పాటు వారి బృందం సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కమిటీ కాలపరిమితి గత మార్చితో ముగిసింది. నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తయ్యేంత వరకు ప్రస్తుత కార్యవర్గమే తదుపరి మూడేళ్ళ కొనసాగేలా గత సర్వసభ్య సమావేశంలో ఒక తీర్మానం చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు.. ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చిన సమస్యలేంటో కౌంటర్ దాఖలు చేయా లని కోర్టు ఆదేశిస్తూ, తదుపరి విచారణ వచ్చే నెల 15కి వాయిదా వేసింది.



'వృషభ' టీజర్ విడుదల

మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'వృషభ'. నంద కిషోర్ దర్శకత్వం వహిస్తున్నారు. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్.వ్యాస్ స్టూడియోస్, ఆశీర్వాద్ సినిమాస్ సమర్పిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్.కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్‌సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టీజర్‌ను నిర్మాతలు ను విడుదల చేశారు. మోహన్‌లాల్ ఇందులో యోధుడి పాత్రలో కనిపించనున్నారు.

2న 'కాంతార : చాప్టర్ 1' ట్రైలర్ విడుదల

కన్నడ సినిమా 'కాంతార: చాప్టర్ 1' అక్టోబర్ 2న విడుదల కానుంది. నటుడు, దర్శకుడు రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం కాంతార సినిమాకు ప్రీక్వెల్. హోంబల్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. రుక్మిణి వసంత్ కథానాయిక. చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. ట్రైలర్‌ను ఈనెల 22న మధ్యాహ్నం 12.45 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కాబోతుంది.



రోబో శంకర్ ఇక లేరు



తమిళ హాస్య నటుడు రోబో శంకర్ (46) కన్నుమూశారు. రెండో రోజుల క్రితం తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. చెన్నైలో మంగళవారం ఓ సినిమా చిత్రీకరణ సమయంలో స్పృహతప్పి పడిపోవడంతో శంకర్‌ను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోయింది. గురువారం రాత్రి ఆయన మరణించారు. ఓ ప్రయివేటు టీవీ ఛానెల్‌లో మిమిక్రీ కార్యక్రమం ద్వారా బుల్లితెరకు పరిచయమైన శంకర్ .. రోబో తరహాలో నృత్యం చేయడం ద్వారా రోబో శంకర్‌గా గుర్తింపు పొందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. విశ్వాసం, పులి, సింగం 3, కోబ్రా తదితర చిత్రాల్లో నటించారు. కామెర్ల సంబంధ వ్యాధితో శంకర్ బాధపడుతున్నట్లు సమాచారం.

టీమిండియాకు ఒమన్ ముచ్చెమటలు

- 21 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకున్న భారత్
- సంజు శాంసన్ అర్ధసెంచరీ
- నేటినుంచి సూపర్–4 పోటీలు



అబుదాబి: ఆసియా కప్ చివరి లీగ్ పసికూన ఒమన్ జట్టు టీమిండియాకు చెమటలు పట్టించింది. టీమిండియా నిర్దేశించిన 189 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 167పరుగులకే పరిమితమైంది. కానీ ఆ జట్టు గెలుపుకోసం చివరివరకు పోరాడిన తీరు వర్ణణాతీతం. భారీ ఛేదనలో భాగంగా ఒమన్ జట్టు చివరి ఓవర్ వరకు గెలుపు కోసం పోరాడుతూనే ఉంది. కలీమ్(64), హమ్మద్ మీర్జా(51) అర్ధసెంచరీలతో రాణించి టీమిండియా బౌలర్లకు ముచ్చెమటలు పట్టించారు. ఈ జోడీని హర్షిత్ రాణా విడదీశాడు. ఆ తర్వాత టీమిండియా బౌలర్లు కట్టడి బౌలింగ్ చేశారు. చివర్లో అర్షదీప్ సింగ్ ఒక వికెట్ పడగొట్టి టి20ల్లో వేగంగా 100వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. దీంతో టీమిండియా 21 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. నామమాత్రపు మ్యాచ్‌లో వికెట్ కీపర్, బ్యాటర్ సంజు శాంసన్ అర్ధశతకంతో మెరిసాడు. మరోవైపు హైదరాబాద్ బ్యాటర్లు అభిషేక్ శర్మ, తిలక్ వర్మకు తోడు అక్షర్ పటేల్ రాణించడంతో ఒమన్‌పై భారతజట్టు భారీస్కోర్‌ను నమోదు చేసింది. తొలినుంచి ఒమన్ బౌలర్లపై విరుచుకుపడుతూ ఓపెనర్ అభిషేక్ శర్మ(38) విధ్వంసం కొనసాగించగా.. సంజూ శాంసన్(56) అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. కానీ, మిడిల్ ఓవర్లలో ఒమన్ స్పిన్నర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. తిలక్ వర్మ(29), అక్షర్ పటేల్(26)లు బౌండరీలతో హోరెత్తించి జట్టుకు భారీ స్కోర్ అందించారు. దాంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి188 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్(5) తొలి ఓవర్లో బౌండరీతో తన ఉద్దేశాన్ని చాటాడు. కానీ, షాహ్ ఫైజల్ వేసిన రెండో ఓవర్లో బంతిని అంచనా వేయలేక క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత సంజూ శాంసన్ అర్ధసెంచరీకి జతగా ఒమన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు అభిషేక్ శర్మ. తనదైన పవర్ హిట్టింగ్ చేసిన అభి.. షకీల్ వేసిన మూడో ఓవర్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 16 రన్స్ పిండుకున్నాడు. నదీమ్‌ను ఉతికేస్తూ.. మూడు ఫోర్లతో విరుచుకుపడ్డాడీ లెఫ్ట్ హ్యాండర్. పవర్ ప్లే ఆఖరి బంతికి అతడు సిక్సర్ కొట్టడంతో స్కోర్ 60కి చేరింది. సంజూ సైతం గేర్ మార్చి ఏడో ఓవర్లో సిక్స్, ఫోర్‌తో రెచ్చిపోయాడు. అయితే.. రమాదిన్ ఓవర్లో బంతి ఎడ్జ్ తీసుకొని కీపర్ చేతుల్లో పడడంతో అభిషేక్ తుఫాన్ ఇన్నింగ్స్ ముగిసింది. అదే ఓవర్లో శాంసన్ ఆడిన బంతిని బౌలర్ రమాదిన్ చేతుల్ని తాకుతూ వికెట్లను గిరాటేయగా పాండ్యా నిరాశగా పెవిలియన్ చేరాడు. వరుసగా రెండు వికెట్లు పడిన తర్వాత వచ్చిన అక్షర్ పటేల్(26) స్కోర్ బోర్డును పెంచాడు. సంజూతో కలిసి నాలుగో వికెట్‌కు 45 రన్స్ జోడించిన అక్షర్‌ను అమిర్ వెనక్కి పంపాడు. ఒమన్ బౌలర్లు ఫైసల్, జితిన్, అమీర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

సూపర్–4లో నేడు..
శ్రీలంక × బంగ్లాదేశ్

చరిత్ర సృష్టించిన అంతిమ్

- ప్రపంచ రెజ్లింగ్ పోటీల్లో రెండోసారి కాంస్య పతకం



జాగ్రేబ్(క్రొయేషియా): ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళా యువ రెజ్లర్ అంతిమ్ పంగల్ చరిత్ర సృష్టించింది. ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండుసార్లు పతకాన్ని సాధించిన ఏకైక మహిళా రెజ్లర్‌గా రికార్డు పుటల్లోకెక్కింది. వినేశ్ పోగాట్ ఒకసారి ఈ పోటీల్లో పతకాన్ని సాధించగా.. అంతిమ్ 2023 తర్వాత 2025లోనూ కాంస్య పతకంతో మెరిసింది. గురువారం జరిగిన మహిళల 53కిలోల రెజ్లింగ్ కాంస్య పతక పోటీలో అంతిమ్.. స్వీడన్‌కు చెందిన జొన్నా ఎమ్మా మల్మ్‌గ్రేన్‌ను 9–1పాయింట్ల తేడాతో మట్టి కరిపించింది. 2023లోనూ తొలిసారి మాల్మ్‌గ్రేన్‌ను ఓడించి కాంస్య పతకం సాధించిన అంతిమ్.. తాజాగా మరోసారి ఆమెపైనే విజయం సాధించడం విశేషం. అనంతరం మాట్లాడుతూ.. సెమీస్‌లో ఓటమితో నిరాశకు గురయ్యాయని పేర్కొంది.

సెమీస్‌కు సాత్విక్–చిరాగ్

క్వార్టర్స్‌లో సింధు ఓటమి

లీ–నింగ్(చైనా): చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి–చిరాగ్ శెట్టి జంట ప్రవేశించింది. మహిళల సింగిల్స్‌లో పివి సింధు పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో సింధు 21–14, 21–13తో కొరియాకు చెందిన టాప్‌సీడ్ అన్–సే–యంగ్ చేతిలో వరుససెట్లలో ఓటమిపాలైంది. ఇక పురుషుల డబుల్స్‌లో 8వ ర్యాంకర్, భారత జంట చిరాగ్–సాత్విక్ 21–14, 21–14తో వరుససెట్లలో చైనా షట్లర్లను చిత్తుచేశారు. శనివారం జరిగే మహిళల సెమీస్‌లో టాప్‌సీడ్ అన్–సే–యంగ్ జపాన్‌కు చెందిన 4వ సీడ్ యమగుచి, 3వ సీడ్ హన్–యు(చైనా) అన్‌సీడెడ్ కొరియాకు చెందిన కిమ్‌తో రెండో సెమీస్‌లో తలపడనుంది.

టైటాన్స్ వరుస ఓటములకు బ్రేక్

- తమిళ్ తైలవాస్‌పై ఘన విజయం



జైపూర్: ప్రొ కబడ్డీ సీజన్–12లో తెలుగు టైటాన్స్ జట్టుకు ఊరట లభించింది. వరుసగా మూడు మ్యాచుల్లో ఓడి నిరాశపరుస్తున్న టైటాన్స్ జట్టు శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్‌ను చిత్తుచేసింది. రైడ్‌ల ద్వారా 20, ట్యాకిల్స్ రూపంలో 13 పాయింట్లు సాధించింది. అలాగే తలైవాస్‌ను మూడుసార్లు ఆలౌట్ కూడా చేసి అదనపు పాయింట్లు చేజిక్కించుకుంది. తొలి అర్ధభాగంలో చెలరేగి ఆడిన టైటాన్స్‌ను తలైవాస్ రెండో అర్ధభాగంలో నిలవరించింది. చివర్లో 6పాయింట్ల అంతరానికి వచ్చే సరికి టైటాన్స్ మళ్లీ పుంజుకుంది. చివరి 10 నిమిషాల్లో టైటాన్స్ 11, తలైవాస్ 8పాయింట్లు సాధించాయి. ఈ గెలుపుతో తెలుగు టైటాన్స్ 9మ్యాచ్‌లు ముగిసేసరికి 8పాయింట్లతో 4వ స్థానానికి ఎగబాకింది. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 34–30పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్స్‌ను చిత్తుచేసింది. హర్యానా రైడర్ వినయ్(14పాయింట్లు) సత్తా చాటగా.. శివమ్ పటారే(8) ఫర్వాలేదనిపించాడు. డిఫెండర్ రాహుల్ రాణించాడు. ఇక పుణేరి పల్టన్స్‌లో పంకజ్ మోహితే(14) ఒంటరి పోరాటం మినహా.. మరే రైడర్ రాణించలేదు. ఈ మ్యాచ్‌లో ఓడినా.. పుణేరి పల్టన్స్ 12పాయింట్లతో టాప్‌లోనే కొనసాగుతోంది.

ప్రొ కబడ్డీలో నేడు..
దబాంగ్ ఢిల్లీ × పట్నా పైరెట్స్(రాత్రి 8.00గం॥లకు)
హర్యానా స్టీలర్స్ × తమిళ్ తలైవాస్(రాత్రి 9.00గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68